



సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌ని సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు, హైకోర్టు సీజే జస్టిస్ ఠాకూర్



కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలికల జట్లు

ఉత్కంఠగా కబడ్డీ పోటీలు

● తలపడుతున్న అంతర్ జిల్లాల క్రీడాకారులు

వినుకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా 69వ కబడ్డీ పోటీలు పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఆదివారం ఉత్కంఠ భరితంగా జరిగాయి. బాలికల విభాగంలో కడప, శ్రీకాకుళం జట్ల మధ్య హోరాహోరీగా పోటీ జరిగింది. ఈ పోటీలో శ్రీకాకుళం జట్టు విజయం సాధించింది. బాలుర విభాగంలో అనంతపురం, విజయనగరం జట్ల మధ్య పోటీ జరగ్గా అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. నిర్వాహకులు, డీసీ చైర్మన్ గంగినేని రాఘవరావు మాట్లాడుతూ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరుగుతున్న పోటీలను తిలకించేందుకు ప్రజలు, క్రీడాభిమానులు ప్రత్యేకంగా ఆసక్తి చూపుతున్నారన్నారు. పోటీలను వీక్షించడానికి వీలుగా గ్యాలరీలు ఏర్పాటు చేశామన్నారు. స్కూల్‌గేమ్స్ సెక్రటరి సురేష్‌కుమార్, డివిజనల్ సెక్రటరి చిరంజీవి, రాధాకృష్ణమూర్తి, జోన్‌సెక్రటరి వీరాంజనేయులు, ప్రెసిడెంట్ రాజేష్, మద్దం వెంకటేశ్వర్లు, వెంకటరత్నం, అంకారావు పోటీలను పర్యవేక్షించారు.

పల్నాటి సిగన.. ఎర్ర మందారం కారంపూడి

● 19 నుంచి వీరారాధన ఉత్సవాలు



పల్నాటి వీరుల ఆయుధాలు

7

ఆ తేజమేది



గుంటూరు : ఎన్‌హెచ్-16పై లాలుపురం సమీపంలో మిర్చి, ఇతర లోడింగ్‌ల కోసం వచ్చి నిలిచిన కంటైనర్లు

తేజ మిర్చి ఎగుమతిలో మాంద్యం

● గత సీజన్‌లో విపరీతంగా విదేశాలకు ఎక్స్‌పోర్టు

● లోడింగ్‌లు లేక గుంటూరు పరిసరాల్లో నిలిచిన కంటైనర్లు

● చైనాలో దిగుమతిదారులతో సంప్రదింపులు జరుపుతున్న ట్రేడర్లు



నరసరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తేజ రకం మిర్చి ఎగుమతిలో మాంద్యం నెలకొన్నది. కొన్ని నెలల నుంచి చైనా, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్‌కు ఎగుమతులు ఆశించిన మేరకు జరగడం లేదు. గత సీజన్‌లో మిర్చి ధర తక్కువగా ఉన్న కారణంగా అక్కడి దిగుమతిదారులు డిమాండ్‌కు మించి తేజ వెరైటీ మిర్చిని కొనుగోలు చేశారని ఇక్కడి ఎగుమతిదారులు చెబుతున్నారు. చైనా డిమాండ్ ఏడాదికి 2 లక్షల టన్నులు కాగా గత ఏడాది 3.20 లక్షల టన్నులను దిగుమతి చేసుకున్నారన్నారు. దీంతో ఎగుమతులు క్షీణించాయంటున్నారు. ఈ కారణంగా గత కొన్ని రోజుల నుంచి గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు)కు అరకొరగానే తేజమిర్చిని రైతులు కోల్డ్‌స్టోరేజ్‌ల నుంచి తీసుకొస్తున్నారు. కాస్తో, కూస్తో కొనుగోలు చేస్తోన్న ట్రేడర్లు ఎగుమతుల ఆర్డర్స్ ఉండి కాదని, స్టాకు పెట్టుకోవడానికి అని ఎక్స్‌పోర్టర్లు చెబుతున్నారు. చైనా, థాయ్‌లాండ్‌కు చెన్నై, కృష్ణపట్నం పోర్టుల ద్వారా కంటైనర్లలో మిర్చి ఎక్స్‌పోర్టు జరుగుతుంటుంది. షిప్‌లోడింగ్‌కు పెట్టగానే కంటైనర్ సంస్థలకు సమాచారం వస్తుంది. దాంతో హడావిడిగా కంటైనర్లను ట్రేడర్ల వద్దకు పంపుతారు. ఇందుకు కారణం నిర్దేశిత తేదీన షిప్ పోర్టు నుంచి బయలుదేరుతుంది కాబట్టి ఆ లోపే కంటైనర్లను తీసుకెళ్లి షిప్ యార్డులో అన్‌లోడింగ్ చేయాల్సి ఉంటుంది. విశాఖ, కృష్ణపట్నం తదితర పోర్టులకు విదేశాలకు వెళ్లిన కంటైనర్లు అక్కడ అన్‌లోడింగ్ అయి వచ్చిన తర్వాత ఖాళీ కంటైనర్లను ట్రక్‌లకు అమర్చి తిరిగి లోడింగ్‌కు పంపిస్తారు. ఆ విధంగా ప్రస్తుతం 40 నుంచి 50 కంటైనర్లు మిర్చియార్డు పరిసర ప్రాంతాలకు తీసుకొచ్చి ఎన్‌హెచ్-16 సర్వీసు రోడ్డులో పార్కింగ్ చేశారు. ఎక్స్‌పోర్టర్లుఎవ్వరైనా లోడింగ్‌కి పిలుస్తారేమోనని ఎదురు చూస్తోన్నారు.

ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదు

ఖాళీ కంటైనర్లు రాగానే మిర్చిని ఇక్కడి వ్యాపారులు లోడింగ్ చేసేవారు. అయితే ఇప్పుడు తమకు ట్రాన్స్‌పోర్టు ఆర్డర్ పెట్టేవారు లేరని కంటైనర్ డ్రైవర్లు చెబుతున్నారు. మిర్చి రవాణా చాలా మాంద్యంగా ఉండటం వల్లే తమకు లోడింగ్ లేక ఖాళీగా పెట్టుకుని ఎదురు చూస్తున్నామని చెప్పారు. కాగా కొంతమంది ఎక్స్‌పోర్టర్లు చైనా వెళ్లి అక్కడి దిగుమతిదారులతో చర్చలు జరుపుతున్నారు. అలానే అక్కడి మార్కెట్ స్థితిగతులను అంచనా వేస్తున్నారు. తేజ వెరైటీ కొనుగోళ్లు మాత్రం మరో రెండు నెలల పాటు ఊపందుకునే పరిస్థితి లేదని తెలిపారు.

మనుగడ సాగించే జీవపత్రం.. రాజ్యాంగం

● ప్రజలందర్నీ దృష్టిలో పెట్టుకుని రాజ్యాంగం రూపకల్పన ● 75 ఏళ్ల రాజ్యాంగ సదస్సులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్

గుంటూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం స్థిరంగా ఉండిపోకుండా పరిస్థితులు, కాలానుగుణంగా పరిణామం చెందుతూ ఎల్లప్పుడు మనుగడ సాగించే జీవపత్రమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తెలిపారు. ఆర్టికల్ 368 ద్వారా రాజ్యాంగ సవరణకు అవకాశాన్ని ఏర్పర్చడం జరిగిందన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం 'ఇండియా అండ్ ది లివింగ్ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ ఎట్ 75 ఇయర్స్' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల వల్లే చాయ్‌వాలా అయిన నరేంద్ర మోదీ దేశ ప్రధాని అయ్యారని, మహారాష్ట్రలో మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన తాను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కాగలిగానని చెప్పారు. ప్రతి పౌరుడ్ని దృష్టిలో పెట్టుకుని డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లకుండా సామాజిక ఆర్థిక సమస్యలను పరిష్కరించుకునేందుకు, దేశాభివృద్ధికి, ప్రజల సంక్షేమం దృష్ట్యా రాజ్యాంగాన్ని సవరించుకునే అవకాశం ఉందన్నారు. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలకు మధ్య వివాదాలు ఏర్పడితే ప్రాథమిక హక్కులకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాజ్యాంగం స్పష్టం చేసిందన్నారు.

ప్రపంచంలోనే అత్యుత్తమమైనది : హైకోర్టు సీజే జస్టిస్ ఠాకూర్

ప్రాథమిక హక్కుల, ఆదేశిక సూత్రాలు, బలహీనవర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తూ రూపొందించిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమైనదని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్‌ఠాకూర్ తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించే విధంగా ప్రజలు అందరూ ముందుకు సాగాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.

అత్యున్నతమైన రాజ్యాంగం : సీఎం చంద్రబాబు

డా.బి.ఆర్.అంబేద్కర్ దేశానికి అత్యున్నతమైన గొప్ప రాజ్యాంగాన్ని దేశానికి అందజేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. దేశంలోని ప్రతి ఒక్కరికి ఎలాంటి తారతమ్యం లేకుండా ఓటు హక్కును కల్పించారన్నారు. చాలా గొప్పవని భావించిన దేశాల్లో కూడా మొదట్లో మహిళలకు ఓటు హక్కు (మిగతా 7లో)



టిడ్కో గృహాల వద్ద లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

● టిడ్కో గృహాల తనిఖీలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

నివాసం లేకుంటే రద్దు చేయాలి

చిలకలూరిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కోసం నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులు నివాసం ఉండకుండా అద్దెకు ఇవ్వడం ఏమిటి. అలా చేస్తే వారికి ఇల్లు అవసరం లేదని గుర్తించి రద్దు చేయాలి.. అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన పట్టణంలోని చెరువురోడ్డులో 52 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన టిడ్కో ప్రాంగణంలో తనిఖీ చేశారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చేలా టిడ్కో ఇళ్లను అద్దెకు ఇవ్వడమేమిటి అని ఆయన ప్రశ్నించారు. అన్ని ఇళ్లను తనిఖీ చేసి వారి వివరణ తీసుకుని అవసరమైతే ఇళ్లు రద్దు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. అనంతరం అక్కడి నివాసితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్కింగ్ స్థలాల్లో నిర్మించిన షెడ్లను తొలగించాలన్నారు. రెండో దశ టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. వచ్చే మార్చికి 5,520 ఇళ్లను పూర్తి చేసి, మౌలిక వసతులు కల్పించి గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ శ్రీహరిబాబు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరీముల్లా, టీడీపీ, జనసేన నాయకులు నెల్లూరి సదాశివరావు, తోట రాజారమేష్, అర్బన్ సీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్తికం.. కిటకిట

● ఆలయాలకు పోటెత్తిన భక్తజనం ● పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు



సూర్యలంక సముద్రతీరంలో పోటెత్తిన భక్తజనం


అమరావతి, బాపట్ల, పెదకాకాని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తిక మాసం చివరి ఆదివారం ఆలయాలు, కృష్ణానది, సముద్ర తీర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు భారీగా తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అమరావతిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తొలుత భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలను వెలిగించారు. అనంతరం అమరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. పెదకాకానిలోని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులతో సందడి నెలకొంది. యజ్ఞాలబావి వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. దీపారాధనల అనంతరం మల్లేశ్వరస్వామికి పొంగళ్లను నివేదించి, ప్రత్యేక అభిషేకాలు చేయించుకున్నారు. బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరం భక్తులతో పోటెత్తింది. తెల్లవారుజాము నుంచే భక్తజనం విశేష సంఖ్యలో తీరానికి తరలివచ్చారు. పుణ్యస్నానాలు ఆచరించి సూర్య నమస్కారాలు చేసి ఇసుకతో శివలింగాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. సముద్రుడికి పండుతాంబూలాలు సమర్పించారు. మధ్యాహ్నం వరకు గంటగంటకు పర్యాటకులు, భక్తుల తాకిడి పెరుగుతూ వచ్చింది. చాలాచోట్ల ట్రాఫిక్ స్తంభించింది.



అమరావతి : ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పెదకాకాని : మల్లేశ్వర స్వామి దేవస్థానంలో నెలకొన్న భక్తుల రద్దీ



మున్సిపాల్టీలో విలీనం చేసిన రావిపాడు రోడ్డులోని ఏరియా

విలీన ప్రాంతాలకూ బీపీఎస్ వర్తింపు

విలీనం.. వెసులుబాటు

● వందల భవనాల క్రమబద్ధీకరణకు అవకాశం
● గతంలో ప్లాన్లు లేకుండా కట్టిన యజమానులకు ఊరట
● పెద్దసంఖ్యలో దరఖాస్తులపై మున్సిపల్ అధికారుల అంచనా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట మున్సిపాల్టీలో విలీనమైన ప్రాంతాలకు కూడా బీపీఎస్ వర్తింపచేయడంతో ప్లాన్ లేకుండా నిర్మించిన భవనాలకు కలసివస్తోంది. విలీన ప్రాంతాలతో మున్సిపాల్టీకి బీపీఎస్ ఆదాయం పెరిగే అవకాశం ఉంది.రావిపాడు, ఇస్సపాలెం, లింగంగుంట్ల, కేసానుపల్లి, యలమందల పంచాయతీల పరిధిలో దాదాపు 4,960 అసెస్‌మెంట్లు(భవనాలు) మున్సిపాల్టీలో విలీనమైన విషయం తెలిసిందే. ఏడేళ్లుగా ఆయా ప్రాంతాల్లో వందల సంఖ్యలో భవనాలను నిర్మించగా అధికశాతం ప్లాన్లు లేనట్లు సమాచారం. వీటిని క్రమబద్ధీకరించుకునే అవకాశం ఆయా భవన యజమానులకు ప్రభుత్వం కల్పించింది. ఈ క్రమంలో విలీన ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో బీపీఎస్‌కు దరఖాస్తులు దాఖలవుతాయని మున్సిపల్ అధికారులు అంచనా వేస్తున్నారు. అపార్ట్‌మెంట్లలో నాలుగు ఫ్లోర్లకు అనుమతి తీసుకుని అదనంగా ఫ్లోర్‌ను అనేకమంది నిర్మించారు. వీటిని కూడా క్రమబద్ధీకరించుకునే అవకాశం బీపీఎస్‌తో వచ్చింది. ప్లాన్ లేకుండా నిర్మించిన ఫ్లోర్లకు 600 అడుగుల వరకు చదరపు అడుగుకు రూ.120 జరిమానా విధిస్తారు. 601 నుంచి 1200 అడుగుల వరకు రూ.150, 1201 నుంచి 2000 అడుగుల వరకు రూ.180, 2000 అడుగులకు పైబడి నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.200 జరిమానా చెల్లించాల్సి ఉంది. ప్లాన్ అతిక్రమించి నిర్మించిన భవనాలకు 600 చదరపు అడుగుల వరకు రూ.20,000, 601 నుంచి 1200 అడుగుల వరకు రూ.40,000, 1201 నుంచి 2000 అడుగుల వరకు రూ.60,000, 2000 అడుగులకు పైబడిన నిర్మాణానికి రూ.80,000 జరిమానా చెల్లించాలి. ఈ క్రమంలో బీపీఎస్ అమలుకు మున్సిపల్ అధికార యంత్రాంగం సమాయత్తమైంది.

రూ.30 కోట్ల వరకు

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018 వరకు బీపీఎస్ అమలు చేశారు. అప్పట్లో మున్సిపాల్టీకి బీపీఎస్ ద్వారా దాదాపు రూ.10 కోట్లు ఆదాయం లభించింది. ఈ నిధులను వెచ్చించి స్టేషన్ రోడ్డులోని ఆర్‌యూబీ, చిలకలూరిపేట రోడ్డులోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్లను నిర్మించారు. ఇప్పుడు అమలు చేస్తున్న బీపీఎస్‌తో మున్సిపాల్టీకి రూ.30 కోట్లకు పైగా ఆదాయం లభిస్తుందని అంచనా వేశారు.

తల్లి మందలింపుతో.. ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి
● డాక్టర్ భీమ్‌రావ్ యశ్వంత్ అంబేడ్కర్

ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుందాం
● ప్రొఫెసర్ కొండవీటి చిన్నయసూరి

మహనీయుల జీవితానుభవాల సారమే.. 'దక్షిణాంధ్ర దారిదీపాలు'

7

సమస్యల మధ్యే చదువులు

● మాదినపాడు పాఠశాలలో అసంపూర్తి పనులు



పాఠశాల ఆవరణలో పెరిగిన గడ్డి, పిచ్చి కంప



అసంపూర్తిగా నిలిచిన తరగతి గదులు

దాచేపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి మారుమూల, అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న మాదినపాడు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో సమస్యల మధ్యే విద్యార్థుల చదువులు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నాడు - నేడు పథకంతో చేపట్టిన తరగతి గదుల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తిపై అధికారులు దృష్టి సారించడంలేదు. దీంతో తరగతి గదులు లేక.. బోధన సక్రమంగా సాగక అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. నాడు-నేడు పథకంలో పాఠశాలకు రూ.1.40 కోట్లతో పనులు చేపట్టారు. అయితే రూ.70 లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. దీంతో మిగిలిన నిధులు విడుదల కాకపోవడంతో పనులు ఆగిపోయాయి. ఈ ఉన్నత పాఠశాలకు మాదినపాడుతో పాటు సమీపంలోని సారంగిపల్లి అగ్రహారం, కొత్తూరు గ్రామాల నుంచి విద్యార్థులు వస్తారు. ఈ ఏడాది ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యా ర్థులు 110 మంది ఉన్నారు. తరగతి గదులకు కిటికీలకు మెష్, తలు పులు లేవు. దీంతో గదుల్లోకి యథే చ్ఛగా విష సర్పాలు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. సెలవు దినాల్లో తలుపులు లేని గదుల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతు న్నాయి. పాఠశాల ఆవరణ అంతా గడ్డి, పిచ్చి కంప పెరిగింది. దీంతో విద్యార్థులు విరామ సమయంలో ఆడుకునేం దుకు అవకాశం లేకుండా పోయింది. ఇన్ని సమస్యల మధ్య విద్యార్థులకు చదువు చెప్పడం, ఉత్తమ ఫలితాలు రాబట్టడం ఉపాధ్యాయులకు కత్తిమీద సాములా మారింది. మాదినపాడు రిజర్వ్ ఫారెస్టుకు సమీపంలోని గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల విద్యా ర్థులకు హైస్కూల్ విద్య అందించాలనే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ పాఠశాలలోని సమస్యలపై అధికారులు, పాలకులు దృష్టి సారించడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పదికి ప్రణాళిక

● మెరుగైన ఫలితాలే లక్ష్యం ● విద్యాశాఖ వంద రోజుల కార్యాచరణ

గుంటూరు(విద్య), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వంద రోజుల ప్రణాళికను అధికారులు అమలు చేస్తు న్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో దాదాపు 300 పైగా ఉన్నత పాఠశాలలు ఉండగా ఆయా పాఠశా లల్లో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు 55,000 మందికిపైగా ఉన్నారు. గత ఏడాది ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో గుంటూరు జిల్లా మొ దటి పది స్థానాల్లో ఉండగా బాపట్ల, పల్నాడు జిల్లాలు కొద్దిగా వెనకబడ్డాయి. ఈ క్రమంలో ఈ ఏడాది అత్యున్నత ఫలితాలే లక్ష్యంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల విద్యాశా ఖాధికారులు ఇప్పటికే ఉపాధ్యాయులకు ఆదే శాలు జారీ చేశారు. ఈ ఏడాది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఉదయం, సాయం త్రం అంటే పాఠశాల ప్రారంభానికి ముందు, ఆ తర్వాత గంట చొప్పున ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. గతంలో జరిగిన ఎఫ్‌ఏ 1, 2 పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కుల్ని పరిశీలించి ఏఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి ఆయా పాఠ్యాంశాల్లో వారికి స్టడీ అవర్లలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందుకు సంబంధించి సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు ఇప్పటికే టైం టేబుల్ కేటాయించారు. ఆయా సబ్జెక్టుల్లో ప్రత్యేక శిక్షణతో పాటు స్టడీ అవర్లలో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేస్తున్నారు. గతంలో జరిగిన ప్రశ్నపత్రాలను సేకరించి అం దులో ముఖ్యమైన ప్రశ్నలు గుర్తించి విద్యార్థు లకు ఉపాధ్యాయులు అందజేశారు. విద్యార్థు లను ఏ, బీ, సీ, డీ గ్రేడ్లుగా విభజించి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇందులో ఏ, బీ గ్రూపుల్లోని విద్యార్థులకు రోజువారి స్టడీ అవర్స్ కొనసాగిస్తున్నారు. సీ, డీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులకు (మిగతా 7లో)



నిజాయతీ, నిశ్చితాభిప్రాయాలకు పరీక్ష

సివిల్స్ 2025 నోటిఫికేషన్‌కు సంబంధించి భర్తీ ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. మూడోది, చివరిదైన పర్సనాలిటీ టెస్ట్(వ్యక్తిత్వ పరీక్ష) త్వరలో ప్రారంభం కానుంది. ఒక పోస్టుకు రెండున్నర నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను పర్సనాలిటీ టెస్ట్‌కు యూపీఎస్సీ పిలుస్తుంది. ఈ టెస్ట్‌కు కేటాయించిన మార్కులు 275 కాగా అభ్యర్థి తుది విజయం, సర్వీస్ కేటాయింపులో ఇదే కీలక పాత్ర పోషిస్తుంది. ఈ నేపథ్యంలో పర్సనాలిటీ టెస్ట్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు కొన్ని సూచనలు.

సివిల్స్ పర్సనాలిటీ టెస్ట్



అభ్యర్థి మానసిక సామర్థ్యాన్ని నిర్ధారించేందుకు ఉద్దేశించినదే ఈ పర్సనాలిటీ టెస్ట్. అభ్యర్థి మేథా గుణాలకు తోడు సమకాలీన సామాజికాంశాలపై తనకున్న అభిరుచి, మానసిక అప్రమత్తత, స్పష్టతతో కూడిన తార్కిక విశ్లేషణ, నాయత్వ లక్షణాలు, నైతిక సమగ్రతను ఇంటర్వ్యూ బోర్డు పరిశీలిస్తుంది. అభ్యర్థి వ్యక్తిత్వమే గీటురాయి. అనుభవజ్ఞులైన సభ్యులతో కూడిన బోర్డు అభ్యర్థిని సమస్త కోణాల్లో సంపూర్ణంగా పరీక్షిస్తుంది. అభ్యర్థి వ్యక్తిగత వివరాలు, తల్లిదండ్రుల నేపథ్యం, విద్యార్హతలు, అలవాట్లు, అభిరుచులు, గతంలో దక్కిన పురస్కారాలు, ఎంపిక చేసుకున్న ఆప్షనల్ సబ్జెక్టు, పనిచేసిన అనుభవం కూడా ఉంటే వృత్తి నేపథ్యం వంటివన్నీ బోర్డు సభ్యులు అడిగే ప్రశ్నల్లో ఉంటాయి. అభ్యర్థులు ఇచ్చే డీటెయిల్డ్ అప్లికేషన్ ఫారం(డీఏఎఫ్) ఆధారంగానే ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థి ఇచ్చిన సమాధానాలనుబట్టి వారి వ్యక్తిత్వాన్ని అంచనా వేసి మార్కులు నిర్ణయిస్తారు.

ఇలా సన్నద్ధమైతే.....

- డీఏఎఫ్ 1, డీఏఎఫ్ 2లో పేర్కొన్న ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా అభ్యర్థి విశ్లేషించగలగాలి. సొంత వివరాలు, జిల్లా, రాష్ట్రం, చదువు సహా అన్నింటిపై అభ్యర్థికి తనదైన అవగాహనే కాదు, వాటిని బోర్డు సభ్యులకు స్పష్టంగా చెప్పగలగాలి.
- వేషధారణలో జాగ్రత్త అవసరం. ముఖ్యంగా పురుషులు సూట్‌తో కూడిన ఫార్మల్ దుస్తులు ధరిస్తే మంచిది.
- శరీర భాష(బాడీ లాంగ్వేజ్) సానుకూలంగా ఉండేలా జాగ్రత్త వహించాలి. భావోద్వేగాలను నియంత్రణలో ఉంచుకోవాలి.
- ఇంటర్వ్యూ బోర్డు మెంబర్లందరితో చర్చిస్తున్నట్టుగా ప్రవర్తించాలి. నేరుగా వారి కళ్లలోకి చూస్తూ సూటిగా సమాధానాలు ఇవ్వాలి.
- జవాబివ్వడానికి ముందు కొన్ని సెకన్లు ఆలోచించి చెప్పాలి. సమాధానంలో వాస్తవికత అంతకుమించి నిజాయతీ ప్రతిబింబించాలి.
- సమాధానం తెలియని పక్షంలో మర్యాదపూర్వకంగా ఇది నాకు తెలియదు అని చెప్పేయాలి.
- వరుసగా సమాధానాలు తెలియకున్నా తత్తరపడవద్దు. ఇచ్చిన సమాధానాల్లో స్పష్టత ఉంటే చాలు, మంచి మార్కులు సాధించవచ్చు. ఈ విషయాన్ని నమ్మండి.
- అన్నింటికీ మించి ఆత్మవిశ్వాసం చాలా ముఖ్యం.

తరచూ అడిచే ప్రశ్నలు

- బోర్డుకు మిమ్మల్ని పరిచయం చేసుకోండి.
- మీరు సివిల్ సర్వీసెస్‌ను ఎందుకు ఎంచుకున్నారు?
- మిమ్మల్ని ప్రభావితం చేసిన వ్యక్తులు, సంఘటనలు ఏవి?
- మీ బలాలు, బలహీనతలు ఏమిటి? మీలో సవరించుకోవాల్సిన లక్షణాలు ఏమిటి?
- ఎంపిక అయ్యాక మీ ప్రాధాన్యాలు ఏమిటి?
- సివిల్ సర్వీసెస్‌లో పెచ్చుమీరిన అవినీతి, అశ్రితపక్షపాతంపై మీ అభిప్రాయం ఏమిటి? వాటిని నిరోధించేందుకు మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?
- వరకట్నం/ పరువు హత్యలు/ పేదరికం/ బాలకార్మిక వ్యవస్థ/ అత్యాచారాలు/ గృహహింస/ నిరుద్యోగం/ పితృస్వామ్య వ్యవస్థ/ కుల వ్యవస్థ వంటి సామాజిక, ఆర్థిక సమస్యలపై మీ అభిప్రాయం ఏమిటి? వాటిని రూపుమాపేందుకు మీరు సూచించే చర్యలు ఏమిటి?

వర్తమాన అంశాలపై అవగాహన

కొన్ని వారాలుగా వార్తా సాధనాల్లో ప్రముఖంగా చర్చిస్తున్న వర్తమాన అంశాలపై సమాచారం సేకరించాలి. వాటిపై స్పష్టమైన అభిప్రాయాలను ఏర్పర్చుకోవడమే కాదు, అదే అడిగితే బోర్డు సభ్యులకు స్పష్టంగా చెప్పగలగాలి. కొన్ని మాదిరి ప్రశ్నలు చూద్దాం.

- సమాఖ్యవాదం - ఆర్థిక సమస్యలు - జీఎస్టీ 2.0
- భారత దేశ శాంతి దౌత్యం - గాజా సంక్షోభం, పశ్చిమాసియా విధానం
- ఇంధన పరివర్తన - గ్రీన్ హైడ్రోజన్ - సోలార్ పవర్
- అంతరిక్ష దౌత్యం - భారత దేశానికి సంబంధించి విస్తరిస్తున్న వ్యవస్థ
- భారత విదేశాంగ విధానం - గ్లోబల్ సౌత్‌లో భారత పాత్ర
- కృత్రిమ మేధస్సు - నియంత్రణ
- వాతావరణ మార్పు, హిమాలయాలు - హిమానీనద తిరోగమనం
- ఆర్థిక సంస్కరణలు - కొత్త ఆదాయపన్ను చట్టం - 2025
- ఎర్రకోటకు సమీపంలో ఉగ్రవాద దాడి, అంతర్గత భద్రతకు ఎదురవుతున్న సవాళ్ళు
- ఢిల్లీ కాలుష్యం - పంట వ్యర్థాల దహన సంక్షోభం
- ట్రంప్ సుంకాలు, భారత్‌పై వాటి ప్రభావం
- గవర్నర్ పాత్ర - కేంద్ర, రాష్ట్ర సంబంధాలు
- ఇండో పసిఫిక్ ప్రాంతంలో భారత పాత్ర.
- ఆపరేషన్ సింధూర్

విశ్లేషించాల్సిన అంశాలు

- వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న పాత్ర, ప్రజాకర్షక పథకాలు, ఉచిత హామీలు, ఏకకాల ఎన్నికలు, అభ్యర్థులకు స్టేట్ ఫండింగ్, ఎన్నికల్లో పెరిగిపోతున్న ధనం, కులం, మతానికి ప్రాధాన్యం, సుప్రీంకోర్టు ఇటీవలి తీర్పులు, న్యాయవ్యవస్థలో అవసరమైన సంస్కరణలు, పార్లమెంట్ ఇటీవల చేసిన చట్టాలు, విపత్తు నిర్వహణలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర, రిజర్వేషన్లు - రాజకీయ రిజర్వేషన్లు, మహిళలకు రిజర్వేషన్ తదితరాలు
- అంతర్జాతీయ అంశాల్లో చైనా దురహంకారపూరిత వైఖరి, పాక్ దుస్సాహసం, క్వాడ్, ఇండో-పసిఫిక్ వ్యూహం, సార్క్, ప్రాంతీయ కూటములు, ఐరాస, ప్రపంచ ఆరోగ్య సంస్థ, వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ వంటి మల్టీ లేటరల్ సంస్థల ప్రాధాన్యం, వివిధ దేశాలతో భారత్ ద్వైపాక్షిక సంబంధాలు
- సామాజిక, ఆర్థిక అంశాల పరిధిలో రైతుల సంక్షేమం కోసం అవసరమైన సంస్కరణలు, ఉద్దేశపూర్వక అప్పు ఎగవేతదారులు, ఎక్స్ట్రాడిక్షన్, ఆర్థిక సర్వే, బడ్జెట్, పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణ, బ్యాంకుల విలీనం, జాతీయ విద్యా విధానం - 2020. జాతీయ ఆరోగ్య విధానం
- పర్యావరణ అంశాల కింద గ్లోబల్ వార్మింగ్, క్లయిమేట్ చేంజ్ - కారణాలు, వివిధ రంగాలపై దాని ప్రభావం, గాలి/ నీరు/ నేల కాలుష్యం - పరిష్కార మార్గాలు, బీఎస్ - 6 వాహనాలు.
- తెలుగు రాష్ట్రాల నుంచి హాజరవుతున్న అభ్యర్థులకు స్థానిక అంశాలపై లోతైన అవగాహన ఉండాలి. తెలంగాణ నుంచి హాజరయ్యే అభ్యర్థులు హైదరాబాద్ నగర నేపథ్యం, విశిష్టత, బిర్యానీ, హలీం వంటి సంప్రదాయ వంటకాలు, ముత్యాల నగరంగా హైదరాబాద్‌కు ఉన్న పేరు, సంక్షేమ - అభివృద్ధి పథకాలు, సామాజిక ఆర్థిక సమస్యలపై వివరాలు సేకరించాలి.
- ఆంధ్రప్రదేశ్ అభ్యర్థులు ప్రత్యేకించి విభజనాంతర సమస్యలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, పెరిగిపోతున్న రెవెన్యూలోటు, తలసరి అప్పు, సంక్షేమ పథకాలు, అమరావతి రాజధాని నిర్మాణం, అభివృద్ధి వికేంద్రీకరణ, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, విశాఖకు గూగుల్ డేటా సెంటర్, ప్రజాకర్షక పథకాలు, పొడవైన తీరప్రాంతాల అభివృద్ధికి చేపట్టిన చర్యలు, రాష్ట్రంలోని దర్శనీయ ప్రదేశాలు, వారసత్వ కట్టడాలపై అవగాహన కలిగి ఉండాలి.



- ఎం.బాలలత
సివిల్స్ మెంటార్

ఏఎఫ్‌క్యాట్



ఎయిర్‌ఫోర్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏఎఫ్ క్యాట్) నోటిఫికేషన్ వెలువడింది. ఈ ప్రకటనతో నియమించుకున్న అభ్యర్థులకు 2027 జనవరి నుంచి కోర్సు ఆరంభమవుతుంది.

- ఏఎఫ్‌క్యాట్ ఎంట్రీ కింద ఫ్లయింగ్ విభాగంలో ఎస్ఎస్‌సి పరిధిలో పురుషులకు 34, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు.
- గ్రౌండ్ డ్యూటీ కింద ఏఈ(ఎల్) పీసీ - పురుషులు 3, మహిళలు 3; ఎస్ఎస్‌సి పరిధిలో పురుషులకు 100, మహిళలకు 9; టెక్నికల్ కింద ఏఈ(ఎం) పురుషులకు 9, మహిళలకు 3; ఎస్ఎస్‌సి పరిధిలో పురుషులకు 38, మహిళలకు 9 కేటాయించారు.
- గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్) - వెపన్ సిస్టమ్స్ బ్రాంచ్‌లో పురుషులకు 21, మహిళలకు 5, అడ్మినిస్ట్రేషన్‌లో పురుషులకు 48, మహిళలకు 12; లాగ్స్‌లో పురుషులకు 9, మహిళలకు 2, అకౌంట్స్‌లో పురుషులకు 8, మహిళలకు 2, ఎడ్యుకేషన్‌లో పురుషులకు 2, మహిళలకు 2; మీటీయోరాలజీలో పురుషులకు 1, మహిళలకు 2 ప్రత్యేకించారు.
- ఎన్‌సీసీ కింద ఖాళీలను ప్రటించలేదు. అయితే సీడీఎస్ఈలో పదిశాతం, పీసీకి ఏఎఫ్‌క్యాట్‌లో పదిశాతం సీట్లను ఎస్ఎస్‌సీ వేకెన్సీలుగా ప్రత్యేకించారు.
- అభ్యర్థులు ఫిజిక్స్, మేథ్స్‌తో ఇంటర్‌కు తోడు సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ/ బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- వయస్సు ఫ్లయింగ్ బ్రాంచ్‌కు 20-24 సంవత్సరాలు ఉండాలి. గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్/ నాన్ టెక్నికల్) బ్రాంచ్‌కు వయస్సు 20-26 సంవత్సరాల మధ్య ఉండాలి.
- దీనికి ఉద్దేశించిన పరీక్ష వచ్చే ఏడాది అంటే 2026 జనవరి 31న జరుగుతుంది. పరీక్షకు ముందు వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుంది. ఏఎఫ్ క్యాట్ పరీక్ష కాలవ్యవధి రెండు గంటల కాగా 100 ప్రశ్నలు ఉంటాయి. గరిష్ఠంగా 300 మార్కుల పరీక్ష. ఆన్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలను జనరల్ అవేర్‌నెస్, వెర్బల్ ఎబిలిటీ ఇన్ ఇంగ్లీష్, న్యూమరికల్ ఎబిలిటీ, రీజనింగ్ అండ్ మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్ నుంచి అడుగుతారు. జవాబుగా కరెక్ట్‌గా గుర్తిస్తే మూడు మార్కులు ఇస్తారు. తప్పయితే ఒక మార్కు కట్ చేస్తారు. వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ప్రాక్టీసింగ్ టెస్ట్ ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతిలో ఈ పరీక్ష జరుగుతుంది.
- ఏఎఫ్‌క్యాట్‌లో విజయం సాధించిన అభ్యర్థులను తదుపరి టెస్టులకు ఏఎఫ్ఎస్‌బి సెంటర్లలో ఒకదానికి పిలుస్తారు. డెహ్రాడూన్, మైసూర్, గాంధీనగర్, వారణాసి, గువాహతిలో ఇవి ఉన్నాయి.
- అర్హులైన అభ్యర్థులు డిసెంబర్ 14 లోపు దరఖాస్తు ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు.
- **వెబ్‌సైట్:** https://afcat.edcil.co.in

కేంద్రీయ, నవోదయ విద్యాలయాల్లో పోస్టులు

కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో స్వయంప్రతిపత్తి సంస్థలైన కేంద్రీయ విద్యాలయ సంఘటన(కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్)లో దేశవ్యాప్తంగా 14,967 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

ఖాళీలు 14,967

పోస్టులు: అసిస్టెంట్ కమిషనర్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, పీజీ టీచర్స్, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్, ప్రైమరీ టీచర్స్, పీఆర్‌టీ(సంగీతం), స్పెషల్ ఎడ్యుకేటర్, లైబ్రేరియన్, కేవీఎస్ నాన్ టీచింగ్ స్టాఫ్, ఎన్‌వీఎస్ నాన్ టీచింగ్ స్టాఫ్

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, అవసరమైతే నైపుణ్య పరీక్షలు/ ఇంటర్వ్యూలు ఆధారంగా.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబర్ 4

వెబ్‌సైట్: https://www.cbse.gov.in/, https://kvsangathan.nic.in/ , https://navodaya.gov.in/

చిత్రజ్యోతి

SINCE 1965

కొత్త చిత్రం షురూ



తిరువీర్ హీరోగా ఆదివారం ఓ నూతన చిత్రం ప్రారంభమైంది. మహేందర్ కుడుదుల దర్శకత్వంలో పరుచూరి వేంకటేశ్వర రావు నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వివేక్ ఆత్రేయ క్లాప్ ఇచ్చారు. ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదరప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ గౌరవ దర్శకత్వం వహించారు. 'పల్లెటూరి నేపథ్యంలో సాగే అద్భుతమైన ప్రేమకథతో ఈ చిత్రం రూపొందుతోంది. వినోదంతో పాటు కదిలించే భావోద్వేగాలు ఉంటాయి' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జగదీశ్ చీకటి.

ఒకరోజు ముందే విడుదల



రామ్ పోతినేని కథానాయకుడిగా నటించిన 'ఆంధ్రాకింగ్ తాలూకా' చిత్రం విడుదల తేదీ మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ చిత్రం ఈనెల 28న విడుదల కావాల్సి ఉంది. అయితే ఒక రోజు ముందుగా ఈ నెల 27న 'ఆంధ్రాకింగ్ తాలూకా' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఆదివారం ప్రకటించింది. ఈ నెల 18న కర్నూలులో భారీ స్థాయిలో నిర్వహించే కార్యక్రమంలో ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఉపేంద్ర కీలకపాత్ర పోషించిన ఈ చిత్రానికి మహేశ్‌బాబు పి. దర్శకుడు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. సంగీతం: వివేక్, మెర్విన్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని

త్రీడీలో అఖండ 2: తాండవం



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2: తాండవం' చిత్రం మేకర్స్ సినీ ప్రియులకు ఓ ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు. డిసెంబరు 5న విడుదలవుతున్న ఈ సినిమాను 3డీ ఫార్మాట్‌లో తీసుకురానున్నట్లు వెల్లడించారు. సంచలన విజయం సాధించిన 'అఖండ'కు సీక్వెల్‌గా ఇది తెరకెక్కుతోంది. ఆదివారం చిత్ర బృందం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'నందమూరి బాలకృష్ణ అభిమానులకు సరికొత్త సినిమాటిక్ అనుభూతిని అందివ్వాలనే ఉద్దేశంతోనే ఈ చిత్రాన్ని త్రీడీలో మీ ముందుకు తెస్తున్నాం. 'భగవద్గీత, రామాయణం, భారతం'.. ఇవి భారతదేశం ఆత్మ. ప్రపంచంలోని మిగతా దేశాల్లో మతం కనిపిస్తుంది. కానీ మన భారత్‌లో మాత్రమే సనాతన ధర్మం కనిపిస్తుంది. ఈ పాయింట్ ఆధారంగానే సినిమాను రూపొందిస్తున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకులూ ఇష్టపడేలా ఉంటుందీ చిత్రం. ఈ సినిమాను దేశమంతా చూడాలనుకుంటున్నాను. అందుకే ప్రచారాన్ని ముంబై నుంచి మొదలుపెట్టాం' అని చెప్పారు. 'ఈ చిత్రానికి ఉన్న కథా పరిధిని దృష్టిలో పెట్టుకొని త్రీడీలో తీసుకువస్తున్నాం. విజువల్స్ అదిరిపోనున్నాయి' అని గోపి ఆచంట చెప్పారు. బాలకృష్ణ కూతురు తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఆది పినిశెట్టి, సంయుక్త, హర్షాలి మల్హోత్రా కీలక పాత్రల్లో కనిపించనున్నారు.



అలా చేస్తున్నది నేను కాదు

- అదితి రావు హైదరి

తన పేరు, ఫొటో ఉపయోగిస్తూ ఓ వ్యక్తి వాట్సాప్‌లో ఫేక్ ఖాతాను వాడుతున్నాడని, దీని పట్ల అప్రమత్తంగా ఉండాలని నటి అదితిరావు హైదరి సూచించారు. 'నా దృష్టికి వచ్చిన ఓ ముఖ్యమైన విషయాన్ని మీతో షేర్ చేసి, మీ అందర్నీ అప్రమత్తం చేయాలనుకుంటున్నాను. నా పేరుతో ఓ వ్యక్తి ఫొటోషూట్స్ పేరిట పలువురు ఫొటోగ్రాఫర్లకు సందేశాలు పంపిస్తున్నాడని తెలిసింది. ఆ పని చేస్తున్నది నేను కాదు. ఫొటోషూట్స్ కోసం నేను వ్యక్తిగత ఫోన్ నెంబరుతో ఎవ్వరినీ సంప్రదించను. నా టీమ్ ద్వారానే నేను ఫొటోగ్రాఫర్స్‌ను సంప్రదిస్తాను. ఎవరైనా నా పేరుతో మీకు ఇలాంటి సందేశాలు పంపితే, వెంటనే మా టీమ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు తెలియజేయండి' అని విజ్ఞప్తి చేశారు.

నేటి పరిస్థితులకు అద్దం పట్టేలా



రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పాంచ్‌మినార్'. రాశీ సింగ్ హీరోయిన్. ఎంఎస్ఎం రెడ్డి నిర్మించారు. ఈ నెల 21న విడుదలవుతోంది. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన చిత్రమిది. అందమైన ప్రేమకథకు మిస్టరీ ఎలిమెంట్స్ జోడించి దర్శకుడు తెరకెక్కించారు. నేటి పరిస్థితులకు అద్దం పట్టేలా ఉంటుంది' అని చెప్పారు. రామ్ మాట్లాడుతూ 'రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథ ఇది. ప్రథమార్థం అంతా వినోదాత్మకంగా, ఉల్లాసంగా నడుస్తుంది. ద్వితీయార్థంలో పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని అన్నారు. కుటుంబంతో కలసి చూసేలా మా సినిమా ఉంటుంది, నా పాత్ర విభిన్నంగా ఉంటుంది' అని రాశీసింగ్ చెప్పారు. మంచి నిర్మాణ విలువలతో తెరకెక్కించాం అని నిర్మాత తెలిపారు.

ప్రేక్షకులను మెప్పించే ప్రేమకథతో వస్తున్నాం

- సాయిలు కంపాటి



'పల్లెటూరి నేపథ్యంలో వస్తున్న పీరియాడిక్ ప్రేమకథా చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని ఈ సినిమా చేస్తున్నాం. ప్రేమకథకు సామాజిక అంశాలను కలిపిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అని సాయిలు కంపాటి అన్నారు. ఆయన దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. అఖిల్, తేజస్విని జంటగా నటించారు. 'రాజు వెడ్స్ రాంబాయి'. వేణు ఊడుగుల, రాహుల్ మోపీదేవి నిర్మించారు. సాయిలు కంపాటి దర్శకుడు. ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సాయిలు కంపాటి మీడియాతో మాట్లాడారు.

- వేణు ఊడుగుల, శ్రీకాంత్ అడ్డాల దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేశాను. మనదైన నేటివిటీ కనిపించేలా రాసుకున్న కథ ఇది. వేణు అన్నకు కథ నచ్చి దర్శకుడిగా అవకాశం ఇచ్చారు.
- నా చిన్నతనంలో మా ప్రాంతంలో జరిగిన కొన్ని సంఘటనల స్ఫూర్తితో కథ రాసుకున్నాను. స్నేహం, వైరం ప్రధానాంశాలుగా కుటుంబ నేపథ్యంలో రూపుదిద్దుకుంది. ఈ కథలో ప్రేమికులకు ఏం జరిగిందనేది మాత్రం తెరపైనే చూడాలి. వరంగల్‌లో షూట్ చేశాం. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్.

అందరూ మెచ్చేలా...



మాస్టర్ మహేందర్ ప్రధాన పాత్రలో వైకుంఠ్ బోను తెరకెకిస్తున్న చిత్రం 'వసుదేవ సుతం'. బేబీ చైత్రశ్రీ బాదర్ల, మాస్టర్ యశ్వాంశ్ కృష్ణ బాదర్ల సమర్పణలో ధనలక్ష్మీ బాదర్ల నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదల చేసిన పోస్టర్లు, టీజర్లు ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి 'ఏమైపోతుందో' అంటూ సాగే గీతాన్ని గీత రచయిత చంద్రబోస్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'పాట చాలా బాగుంది. అందరూ మెచ్చేలా చిత్రం ఉండబోతోంది. ఈ చిత్రం ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. శ్రీహర్ష ఈమని రాసిన ఈ పాటను పవన్‌చ శృతిక సముద్రాల ఆలపించారు. మణిశర్మ సంగీతం అందించారు.

పేరు తెచ్చే పాత్రలు చేస్తున్నా

- కామాక్షి భాస్కర్ల



'విజయ్ సేతుపతి, సుహాస్ లాంటి నటులు హీరోలుగా నటిస్తూనే ఇతర పాత్రల్లోనూ మెప్పిస్తున్నారు. నేను కూడా ఆ తరహాలో ఎందుకు ప్రయత్నించకూడదు అనుకున్నాను. అందుకే కథానాయికగా చేస్తూనే, నటిగా పేరు తెచ్చే సహాయ పాత్రలనూ చేస్తున్నాను' అని కామాక్షి భాస్కర్ల అన్నారు. అల్లరి నరేశ్, కామాక్షి భాస్కర్ల జంటగా నటించిన చిత్రం '12 ఏ రైల్వే కాలనీ'. నాని కాసరగడ్డ దర్శకత్వంలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. దర్శకుడు డాక్టర్ అనిల్ విశ్వనాథ్ కథను అందించడంతో పాటు దర్శకత్వ పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కామాక్షి భాస్కర్ల సినిమా విశేషాలను పంచుకున్నారు. ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో ఈ సినిమా రూపొందింది. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. ఇందులో నా పాత్ర పేరు ఆరాధన. కథను మలుపు తిప్పే పాత్ర. ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా దర్శకుడు తీర్చిదిద్దారు. ప్రేమవల్ల ఆమె జీవితం ఎలాంటి మలుపు తీసుకుందనేది ఆసక్తికరంగా ఉంటుంది. అలాగే రైల్వే కాలనీలో జరిగిన అనూహ్య సంఘటనలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయనేది ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయి.

గ్రామీణ నేపథ్యంలో



పల్లెల్లో ఉండే అనుబంధాలు, ఆప్యాయతల కలబోతగా సాగే చిత్రం 'మా రాముడు అందరివాడు'. సీనియర్ నటుడు సుమన్ ప్రధాన పాత్ర పోషించారు. శ్రీరామ్, స్వాతి జంటగా నటించారు. యద్దనపూడి మైఖైల్ దర్శకత్వంలో అనుముల లక్ష్మణరావు, పల్లకొండ శ్రీరాములు నిర్మించారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్రం టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కుటుంబ భావోద్వేగాలు, వాణిజ్యాంశాలతో నిండిన భారీ యాక్షన్ చిత్రమిది. పల్లె వాతావరణంలో రూపొందిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరించేవిధంగా ఉంటుంది' అని అన్నారు. మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిదని నిర్మాతలు తెలిపారు.

ద్విభాషా చిత్రంలో జాబిలి



కోర్ట్ చిత్రంలో జాబిలి పాత్రతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కథానాయిక శ్రీదేవి అపల్లా. తమిళ నటుడు ఏగన్, 'మిన్నల్ మురళీ' ఫేమ్ ఫెమినా జార్జ్‌కు జోడీగా ఆమె నటిస్తున్నారు. తెలుగు తమిళ భాషల్లో రూపొందుతున్న ఈ సినిమాను ఇటీవలె ప్రారంభించారు. యువరాజ్ చిన్నసామి దర్శకత్వంలో 'జో' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న విజన్ సినిమాస్ పతాకంపై డాక్టర్ డీ అరుళనందు, మాథ్యుయో అరుళనందు నిర్మిస్తున్నారు. విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే మరిన్ని వివరాలు ప్రకటించనున్నారు.

మహనీయుల జీవితానుభవాల సారమే..

‘దక్షిణాంధ్ర దారిదీపాలు’


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణమూర్తి, రామకృష్ణ

గుంటూరు (తూర్పు), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శతాబ్దాల తెలుగు వైభవాన్ని దశదిశల విస్తరించి.. సంస్కృతి ప్రభావాన్ని తెలియజేసిన ఎందరో మహనీయుల జీవితాలను గ్రంథస్తం చేసిన నాగసూరి వేణుగోపాల్ జీవితం ధన్యమని ప్రొఫెసర్ ఆచార్య వకుళాభరణం రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక నగరంపాలెంలోని ఆర్యవైశ్య బాలుర వసతి గృహంలో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'దక్షిణాంధ్ర దారి దీపాలు' గ్రంథావిష్కరణ సభ నిర్వహించారు. గ్రంథావిష్కరణ చేసిన డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ప్రముఖ పాత్ర పోషించిన తెలుగు మహనీయుల గురించి సమగ్ర పరిశోధన జరగలేదన్నారు. దక్షిణాంధ్ర దారి దీపాలు గ్రంథం ద్వారా వేణుగోపాల్ ఆ లోటును తీర్చారన్నారు. ప్రముఖ పరిశోధకులు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి మాట్లాడుతూ.. రైతు సంస్కరణలు అమలు చేసిన బొబ్బిలి రాజా, తమిళ రాష్ట్ర ప్రభుత్వ చక్రం లోగో రూపొందించిన రామస్వామి రెడ్డియార్, వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్న మొదటి వ్యక్తి గాదె రంగయ్య నాయుడు, మొదటి దినపత్రిక వ్యవస్థాపకులు దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు, మొదటి మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముత్తా వెంకట సుబ్బారావు, తెలుగు సాహిత్యానికి అచ్చు రూపం కల్పించిన వావిళ్ల రామస్వామి దీక్షితులు వంటి ఎందరో తెలుగు పెద్దల విశేషాలు ఈ గ్రంథం ద్వారా తెలుస్తాయని అన్నారు. గ్రంథ రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ తెలుగు పెద్దల జీవిత విశేషాలను, కృషిని దక్షిణాంధ్ర దారి దీపాల ద్వారా వెలుగులోకి తెచ్చానన్న సంతృప్తి మనసుకు ఆనందాన్నిస్తున్నదన్నారు. వీవీఐటీ విశ్వవిద్యాలయం పబ్లికేషన్స్ డివిజన్ సమన్వయకర్త మోదుగుల రవికృష్ణ సభా నిర్వహణ గావించగా, డాక్టర్ కామేపల్లి రత్నబాబు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, గద్దె మంగయ్య, గోటేటి లలితశేఖర్, ప్రొఫెసర్ మురళీమోహన్, ప్రొఫెసర్ ఎస్వీ కృష్ణారావు పాల్గొన్నారు.

తల్లి మందలింపుతో..

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

తెనాలి క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందన్న మనస్తాపంతో ఇంజనీరింగ్ విద్యార్థి ఫ్యాన్‌కి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్ టౌన్ పోలీసులు వివరాల మేరకు.. స్థానిక నాజరుపేట మహాలక్ష్మి చెట్టు బజారులో నివాసం ఉంటున్న వెంకటరమణ కుమారుడు వింజమూరి పవన్ తేజ (24) తాడేపల్లిలోని ఇంజనీరింగ్ కాలేజీలో మూడవ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం వీకెండ్ కావడంతో తోటి విద్యార్థులతో పార్టీ చేసుకుని ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. దీనితో తల్లి మందలించింది. మనస్థాపంతో పవన్ తేజ తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో బాత్రూమ్‌కి వెళ్లబోతుండగా అన్న గదిలో ఇంకా లైట్లు వెలిగి ఉండటం గుర్తించి చెల్లెలు తలుపు తట్టింది. తలుపు తియ్యకపోవడంతో తల్లిదండ్రులను నిద్రలేపింది. వారు తలుపులు బద్దలు కొట్టి చూడగా పవన్‌తేజ దుప్పటితో ఉరి వేసుకుని ఫ్యాన్‌కి వేలాడుతున్నాడు. వెంటనే తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు వెల్లడించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుందాం

● ప్రొఫెసర్ కొండవీటి చిన్నయసూరి


ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ చిన్నయ్య సూరి

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బానిస, రాచరిక వ్యవస్థలను అంతమొందించి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం నినాదాలతో ముందుకొచ్చిన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి విద్యార్థులు కృషి చేయాలని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ పూర్వ ఆచార్యులు కొండవీటి చిన్నయ సూరి పిలుపునిచ్చారు. ఆదివారం గుంటూరు ఏసీ కళాశాలలోని అసెంబ్లీ హాలులో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పోటీ పరీక్షల శిక్షణ కార్యక్రమంలో ప్రజాస్వామ్య విలువలపై జరిగిన సభకు ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ చిన్నయ సూరి పాల్గొని, ప్రసంగించారు. 18వ శతాబ్దంలో అమెరికాలో బానిస వ్యవస్థపై అధ్యక్షుడు అబ్రహాం లింకన్ సైనిక పోరాటం చేసి విజయం సాధించారని, 1789లో ఫ్రెంచ్ ప్రజలు రాచరికంపై తిరుగుబాటు చేసి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే నినాదాలతో ప్రజాస్వామ్య వ్యవస్థను నెలకొల్పారని వివరించారు. కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎస్. మధుబాబు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి తార్కిక చింతనను పెంచుకొని, జ్ఞాపక శక్తిని మెరుగు పరుచుకోవాలన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ విద్యార్థులకు ఆర్థిక చేయూతను అందిస్తూ, పోటీతత్వాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి కె. సతీష్, కె.పావని, కె.అరుణాచలం, రిసోర్స్ పర్సన్స్ జి.ప్రకాష్, బేతపూడి మంగారావు, షేక్ రెహమాన్, ఆదినారాయణ పాల్గొన్నారు.

పుస్తక లక్షాధికారి..లంకా సూర్యనారాయణ

● నేడు ఎస్వీయూలో జీవిత సాఫల్య పురస్కార ప్రదానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చూడ్డానికి సాదాసీదాగా కన్పించే లంకా సూర్యనారాయణ లక్షకు పైగా పుస్తకాలు సేకరించి, సంరక్షిస్తున్నారంటే ఆశ్చర్యమేస్తుంది. గుంటూరులో పుస్తకాభిమానులు ముద్దుగా గ్రంథాళ్వార్‌గా పిలుచుకునే ఆయన గ్రంథాలయంలో చదువుకున్న అనేక మందికి ప్రపంచ విజ్ఞానం ఒంటబట్టింది. కుమారుడు కూడా వరంగల్ నిట్ లో ప్రొఫెసర్ స్థాయికి ఎదిగారు. ఎస్వీ వర్శిటీలోని శ్రీనివాసా ఆడిటోరియంలో సూర్యనారాయణకు సోమ వారం జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనతో ఆంధ్రజ్యోతి సంభాషణ.

నేపథ్యం: మాది గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు గ్రామం. వ్యవసాయ కుటుంబం. అమ్మానాన్న పెదలక్ష్మినారాయణ, రంగనాయకమ్మ. ప్రత్తిపాడు హైస్కూల్లో పదవ తరగతి వరకూ, గుంటూరులో బీఎస్సీ దాకా చదివా. కస్టమ్స్ శాఖలో సూపరిండెంట్‌గా పని చేసి రిటైరయ్యా. శ్రీ వేంకటేశ్వర ధార్మిక సేవా సమితి, అన్నమయ్య సేవా సమితి, స్వధర్మ సేవా సమితి అధ్యక్షుడిగా పని చేశా.

పుస్తకాలపై ఆసక్తి: గాలీ నీరూ వెలుగూ అందరికీ ఎలా లభిస్తున్నాయో, పుస్తకాలు కూడా అంతగా అందుబాటులో ఉండాలనే చిలకమర్తి లక్ష్మీనరసింహం వ్యాఖ్య నాకు నిత్యస్ఫూర్తిని కలిగిస్తుంటుంది. దీంతో పాటు మా బాబాయి ఉప్పలపాటి ఆనందరావు కమ్యూనిస్టు కార్యకర్త. ఆయనకు విపరీతమైన పుస్తకాల పిచ్చి. ఆయన ద్వారా పుస్తకాలకు చేరువై లెక్కకుమించి చదివా.

గ్రంథాలయ ఏర్పాటుకు బీజం: గుంటూరులో అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం ఏర్పాటు చేయాలనే ఆసక్తి కలిగింది. పుస్తకాలను సేకరించి, గ్రంథాలయంలో కొలువుదీర్చా. అనేకమంది సాహితీ ప్రముఖులు, పుస్తకాభిమానులు సందర్శిస్తుండడం చూసి నేను కూడా పుస్తక విజ్ఞాన వ్యాప్తికి కృషి చేస్తున్నాననే అనుభూతి కలుగుతుంది. ఈ గ్రంథాలయాన్ని భవిష్యత్తు తరానికి కూడా అందించాలనుకుంటున్నా.

పుస్తకాల సేకరణ: మా కుటుంబ వ్యక్తిగత గ్రంథాలయంలోనే 80 వేల పుస్తకాలుండేవి. అనేక మంది ప్రముఖులు మా ఇంటి లైబ్రరీకి వచ్చి పుస్తకాలు చదువుకునేవారు. ఇప్పుడు ఈ సంఖ్య లక్షా 30 వేలకు చేరింది. 100 మహా భాగవతాలు, 300 భాగవతాలు, 500 భగవద్గీతలు, 550 రామాయణాలు, 5 వేల ఆత్మకథలు, 51మంది అనువాదకులు చేసిన అనువాద గ్రంథాలు, 1600 శతకాలు, 700 నిఘంటువులు సేకరించా. వీటిలో ఏ పుస్తకమైనా కేటలాగ్ అవసరం లేకుండా క్షణాల్లో చేతికి అందించగలను. తెలుగు, ఇంగ్లీషు, హిందీ వంటి భాషా పుస్తకాలు కూడా అనేకం ఉన్నాయి. వివిధ భాషా, సాహిత్య రంగాల్లో పరిశోధన చేసే వారికి ఈ గ్రంథాలయం బాగా ఉపయోగపడుతుంది.

లభించిన గుర్తింపు: నవ్యాంధ్ర రాష్ట్ర తొలి ఉగాది కళారత్న పురస్కారం పొందా. శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2017లో కీర్తి పురస్కారంతో సత్కరించింది. 2018 లో అజోవిభో కందాళం పురస్కారాన్ని స్వీకరించా. జానుమద్ది హనుమచ్ఛాస్త్రి పురస్కారం, పాతూరి నాగభూషణం పురస్కారం, బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ వారి పురస్కారం, అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి సేవారత్న పురస్కార, సత్కారాలతో గుర్తింపు పొందా.

లక్ష్యం: ప్రస్తుతం తొంభై ఏళ్ల వయసులో ఒకే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా. సేకరించిన పుస్తకాలను శాశ్వతంగా పరిరక్షించడానికి డిజిటలైజ్ చేయాలనే ఆలోచనలో ఉన్నా. ఇందుకు పుస్తకాభిమానుల సహకారాన్ని కోరుతున్నా.

పుస్తకాభిమానులకు సలహా: పుస్తకాలను కొని చదవడమే కాదు, నలుగురికి అందించడం గొప్ప విషయం. మనం తెలుసుకున్న మంచి విషయాలను నలుగురికి తెలియజేయడం అవసరం. ఇది మనకు సంతృప్తిని కలిగించడమే కాక సమాజానికి కూడా మంచి చేస్తుంది. పుస్తకాన్ని మనం చదవడంతో పాటు అందరికీ చేరువ చేయడం పుస్తకాభిమానుల బాధ్యత.

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘనస్వాగతం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు మొక్క అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

బాపట్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదివారం బాపట్ల మండలం పాండురంగాపురంలోని గోల్డెన్ శాండ్స్ ఫైవ్ స్టార్ హోటల్‌లో బస చేశారు. ఒక రోజు పర్యటనలో భాగంగా ఉదయం వచ్చిన ఆయనకు హోటల్ దగ్గర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలు అందజేశారు. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్పీ బి.ఉమామహేశ్వర్, జేసీ భావన వశిష్ఠ, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, ఆర్డీవో పి.గ్లోరియా, డీఎస్పీ జి.రామాంజనేయులు, బాపట్ల, చీరాల తహసీల్దార్లు షేక్.సలీమా, గోపీకృష్ణ తదితరులు గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

● డాక్టర్ భీమ్‌రావ్ యశ్వంత్ అంబేడ్కర్


మాట్లాడుతున్న యశ్వంత్ అంబేడ్కర్

విజయపురిసౌత్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని అంబేడ్కర్ మనువడు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ భీమ్‌రావ్ యశ్వంత్ అంబేడ్కర్ పేర్కొన్నారు. ఆదివారం విజయపురిసౌత్ మాల మహానాడు అధ్యక్షుడు బొబ్బిలి చంద్రశేఖర్ ఆధ్వర్యాన నిర్వహించిన మాల సంఘీయుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జింఖానా గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలు తమ హక్కులను కాపాడుకునేందుకు అంబేడ్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాను బలోపేతం చేయాలన్నారు. లౌకిక రాజ్యాన్ని బీజేపీ మతతత్వ రాజకీయంగా మారుస్తుందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఆర్ఎస్, ఆర్‌బీఐ ఏపీ అధ్యక్షుడు ఉప్పులేటి దేవిశ్రీప్రసాద్, ఆర్‌బీఐ ఏపీ-తెలంగాణ పరిశీలకుడు మేజర్ చంద్రకాంత్, జగదీష్, సుదర్శన్, దాసి మల్లికార్జున, ఎన్ కోటయ్య, మునెయ్య, లక్ష్మయ్య, రాగిడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మనుగడ సాగించే జీవపత్రం.. రాజ్యాంగం

(5వ పేజీ తరువాయి)

లేదన్నారు. ప్రపంచంలో ఎన్నో ప్రజాస్వామ్య దేశాలు ఉన్నప్పటికీ, వాటిలో 2024కి 94 కోట్ల ఓటర్లతో ఉత్తమమైన ప్రజాస్వామ్య దేశంగా భారత దేశం నిడవడానికి రాజ్యాంగమే మూల కారణమన్నారు. గొప్ప రాజ్యాంగాన్ని కలిగిన భారతీయ పౌరులందరూ గర్వించదగ్గ విషయమన్నారు. ప్రజాస్వామ్యం దారి తప్పినప్పుడు న్యాయవ్యవస్థ దాన్ని గాడినపెడుతుందనే విషయాన్ని మనం ఎవ్వరూ మర్చిపోకూడదన్నారు. సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపి హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీ రూపకల్పనకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నా మని, అందుకు అందరూ సహకరించాలని కోరారు. సదస్సులో ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కే చిదంబరం స్వాగతోపన్యాసం చేయగా, ఏజీ దమ్మలపాటి శ్రీనివాస్ ప్రసంగించారు. గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ చక్రవర్తి, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం జనరల్ సెక్రెటరి సుబోధ్, అదనపు అడ్వకేట్ జనరల్ సాంబశివప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం లక్ష్మీనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారథి, ఇతర రిజిస్ట్రార్లు, సీనియర్ న్యాయవాదులు, గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా తదితరులు పాల్గొన్నారు.

పదికి ప్రణాళిక

(5వ పేజీ తరువాయి)

స్టడీ అవర్స్‌తో పాటు వారు వెనుకబడి ఉన్న సబ్జెక్టుల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.

నిత్యం పర్యవేక్షణ

పరీక్షలు హాజరయ్యే విద్యార్థుల స్టడీ అవర్స్ ను విద్యాశాఖ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. డీఈవో, డీవైడీఈవో, ఎంఈవోలు ఇందు కోసం ప్రత్యేక షెడ్యూల్ నిర్దేశించుకుని పాఠశాలలను సందర్శిస్తున్నారు. ఈ సందర్శనలో విద్యార్థులు ఏఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారు. ఇప్పటి వరకు సబ్జెక్టుల వారీగా వచ్చిన మార్కులు పరిశీలించి నివేదికలు తయారు చేయనున్నారు. జడ్పీ నుంచి ముందుగానే స్టడీ మెటీరియల్ తెప్పించుకునేందుకు విద్యాశాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. స్టడీ అవర్స్‌లో విద్యార్థులకు డిసెంబరు నుంచే అల్పాహారం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

పల్నాటి సిగన..

ఎర్ర మందారం కారంపూడి

కారంపూడి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పౌరుషాల పోతుగడ్డ పల్నాటి యుద్ధ భూమిలో రక్తపుటేర్లు పారాయి. గొంతు తెగి తల నేల వాలుతున్నా ప్రత్యర్థి పైకి లంఘించి.. హతమార్చిన ఎందరో వీరులను తనలో కలుపుకున్న పుణ్యభూమి పల్నాడు. పదవీ వ్యామోహం, రాజ్యకాంక్ష, శైవ, వైష్ణవ మత సంఘర్షణలతో దాయాదులు సలిపిన పోరులో వేలాదిగా వీరులు అలిసిపోయి.. నేలతల్లి ఒడిన సేద తీరుతున్నారు.. యుద్ధం ముగిసింది. రాజ్యాలు గతించాయి. 9 శతాబ్దాలు గడిచినా నాటి స్మృతులు నేటికీ పదిలంగానే ఉన్నాయి. వయసు మీద పడిన వృద్ధులు పలికే గాథల్లోనూ.. పసి పిల్లలకు తల్లులు గోరుముద్దలు తినిపిస్తూ ఆలపించే గానంలోనూ నాటి వీరుల పౌరుష పరాక్రమాలు తెలిపే పల్నాటి యుద్ధం నేటికీ పదిలంగానే ఉంది. ఏడాదికోమారు వీరాచారవంతులు నాడు యుద్ధంలో నర్తించిన తమ పూర్వీకుల ఆయుధాలతో యుద్ధభూమికి చేరుకొని మనసారా వారిని స్మరించుకొని ప్రత్యేక పూజలతో శాంతింపజేసి వెళ్తుంటారు.. వీరారాధన ఉత్సవాల పేరిట పల్నాట కారంపూడిలో ఈ ఉత్సవాలు జరుపుతారు.. ఈ నెల 19 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.


యుద్ధభూమిలో దక్షిణం వైపున నిర్మించిన వీరుల సేవా స్థలం

19 నుంచి మొదలు..

ఆనాటి యుద్ధ విశేషాలను వివరిస్తూ.. పల్నాటి వీరారాధనోత్సవాల పేరుతో 900 ఏళ్లుగా ఐదు రోజులపాటు వైభవంగా నిర్వహిస్తున్నారు. పద్నాలుగు జిల్లాల నుంచి శిష్యులు, కన్నమనీయులు, పిన్నమనీయులు పాల్గొంటారు. రాచగావు, రాయబారం, మందపోరు, కోడిపోరు, కళ్లిపాడు పేర్లతో ఉత్సవాలు జరుపుతారు. ఈ నెల 19న మొదటి రోజు రాచగావు, 20న రాయబారం, 21న మందపోరు, 22న కోడిపోరు, 23వ తేదీన కళ్లిపాడుతో ఉత్సవాలు ముగుస్తాయి. ఏర్పాట్లను పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు, పీఠం నిర్వాహకుడు విజయ కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

19 నుంచి వీరారాధన ఉత్సవాలు

● రక్తపుటేరులైన యుద్ధభూమి
● దాయాదుల పోరులో అమరులైన వీరులు
● సజీవ సాక్ష్యాలుగా వీరుల ఆయుధాలు

ఆతిథ్యం స్వీకరించి.. రాజ్యాధికారాన్ని వరంగా ఇచ్చి..

పల్నాటి రాజ్యాన్ని పరిపాలిస్తున్న అనుగురాజు.. ఒకసారి కారడవిలో నాగమ్మ ఆతిథ్యాన్ని స్వీకరించి.. ఆమెకు కొంతకాలం రాజ్యాధికారాన్ని వరంగా ఇవ్వడంతో పల్నాటి చరిత్రకు అంకురార్పణం జరిగింది. అనుగురాజు గతించి నలగామరాజు.. రాజుగా, బ్రహ్మనాయుడు మంత్రిగా పరిపాలనా బాధ్యతలు స్వీకరించిన సమయంలో తండ్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోమని నాగమ్మ కోరడంతో గత్యంతరం లేక నలగామరాజు నాగమ్మకు రాజ్యాధికారం అప్పగించాడు. నాగమ్మ తనకు ప్రాప్తించిన విశేష అధికారాలతో బ్రహ్మనాయుడును దోషిగా చిత్రీకరించి నలగామరాజు సోదరుడు మలిదేవరాజును కారాగారంలో వేయించింది. బ్రహ్మనాయుడు మలిదేవరాజును విడిపించి మాచర్లలో రాజ్యాన్ని ఏర్పాటు చేసి సుభిక్షంగా పాలన సాగించారు. దీంతో కన్నుకుట్టిన నాగమ్మ మాచర్ల రాజ్యాన్ని కైవసం చేసుకోవాలని కుయుక్తులు పన్నింది. నాగమ్మ చెప్పుడు మాటలు విని నలగాముడు ఆమె చేతిలో కీలుబొమ్మ అవుతాడు. జూద వ్యసనుడైన బ్రహ్మనాయుడును కవ్వించి గురజాలకు పిలిపించింది నాగమ్మ.



బ్రహ్మనాయుడు, నాగమ్మ విగ్రహాలు

కీలకంగా కోడిపోరు..

ద్వాపరాన మహాభారత యుద్ధానికి బీజం పడిన జూదమే పల్నాట యుద్ధానికి ప్రధాన కారణంగా నిలిచింది. నాడు ధర్మరాజు పాచికల క్రీడలో రాజ్య భ్రష్టుడై అడవులకు వెళ్లగా.. పల్నాట కోడిపోరులో ఓడిన మలిదేవ, బ్రహ్మనాయుడు అడవుల పాలవుతారు. నాగమ్మ వారిని కోడి పందేలకు కవ్వించి.. కుతంత్రంతో ఓడించి అడవులకు పంపుతుంది. నిర్ణీత కాలం తర్వాత.. రాజ్యం కోసం తను చేసిన విజ్ఞప్తిని మన్నించక దూతగా వచ్చిన అలరాజును చంపించడంతో ఆగ్రహోదక్షుడైన బ్రహ్మనాయుడు యుద్ధం అనివార్యమని తలచి.. మలిదేవరాజు తరుపున యుద్ధానికి దిగుతాడు. ఈ దాయాదులు.. యుద్ధభూమిగా కారంపూడిని ఎంచుకొని పద్దెనిమిది రోజులు ఏకధాటిగా నాగులేటి ఒడ్డున పోరాటం చేస్తారు. ఈ పోరులో నాయకురాలు నాగమ్మ.. బ్రహ్మనాయుడు చేతికి చిక్కగా స్త్రీ అనే కారణంగా ప్రాణబిక్ష పెట్టడంతో ఆమె పారిపోతుంది. యోధానుయోధులైన వీరులందరూ మరణిస్తారు. కన్నమదాసు, బాలచంద్రుడు, మలిదేవరాజు యుద్ధంలో వీరమరణం చెందుతారు. దీంతో విరక్తి చెందిన బ్రహ్మనాయుడు రాజ్యాన్ని నలగామరాజుకు అప్పగించి గుత్తికొండ బిలానికి తపస్సుకు వెళ్లడంతో పల్నాటి యుద్ధం ముగుస్తుంది.

పిడుగు వంశీయులు పీఠాధిపతులుగా



ఆనాడు బ్రహ్మనాయుడు గుత్తికొండ బిలానికి వెళ్తూ యుద్ధంలో మరణించిన వీరులకు ఉత్సవాలు నిర్వహించడానికి వీరాచార పీఠం ఏర్పరిచి పిడుగు వంశీయులైన బ్రాహ్మణులను పీఠాధిపతులుగా నియమించారు. వంశపారపర్యంగా వస్తున్న ఈ పీఠాధిపత్యంతో ఈ ఉత్సవాలు యువకుడైన పిడుగు తరుణ్ చెన్నకేశవ అయ్యవారు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో చివరిరోజైన కళ్లిపాడును రక్తం కలిపిన అన్నపు ముద్దలు పోతురాజు గుట్ట వద్ద ఆకాశంలోకి పీఠాధిపతి విసిరివేస్తారు. ఆ ముద్దలు శక్తులు (వీరులు) స్వీకరిస్తాయని నమ్మకం. ఈ తంతు ఆ నాటి నుంచి నేటి వరకు ఆనవాయితీగా వస్తోంది. నాడు వీరులు వాడిన ఆయుధాలకు నాగులేటిలో స్నానమాచరింపజేసి అలంకరించి ఊరేగిస్తారు. బ్రహ్మన్న (పీఠాధిపతి) ఇచ్చిన తీర్థం తీసుకొని ఆ కొణతములు పోతురాజు గుట్టపై ఒరగడంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు



అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

రూపెనగుంట్ల ఎఫ్ఏ కాంట్రాక్ట్ తాత్కాలికంగా రద్దు

నకరికల్లు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రూపెనగుంట్ల క్షేత్ర సహాయకునిగా పని చేస్తున్న కోనంకి శివ గోపీ కాంట్రాక్ట్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తూ పల్నాడు జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సిద్ధ లింగమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. కోనంకి శివ గోపీ క్షేత్ర సహాయకునిగా పనిచేస్తూ పలు అవకతవకలకు పాల్పడినట్టు గ్రీవెన్స్‌లో అభియోగాలు నమోదయ్యాయి. ఫిర్యాదులపై విచారణ జరిపిన సత్తెనపల్లి ఏపీడీ పి.వెంకట నారాయణ సమగ్ర నివేదికను డ్వామా పీడీ లింగమూర్తికి అందజేశారు. నివేదిక ఆధారంగా శివ గోపీ కాంట్రాక్ట్‌ను తాత్కాలికంగా రద్దు పరుస్తూ లింగమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

మాచర్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ, మండలంలోని జమ్మలమడక గ్రామంలో పేకాట స్థావరాలపై పట్టణ, రూరల్ పోలీసులు ఆదివారం దాడులు జరిపారు. పట్టణంలోని 26వ వార్డు నూరు మసీదు ప్రాంతంలో పట్టణ సీఐ వెంకటరమణ ఆధ్వర్యాన పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ. 14 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే మండలంలోని జమ్మలమడక గ్రామంలో రూరల్ ఎస్ఐ ఉదయలక్ష్మి సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.2700 స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

సత్తెనపల్లి రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో కొలువైన శ్రీప్రసన్నాంజనేయ స్వామి 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా వేకువజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలతోపాటు 13 రకాల ద్రవ్యాలతో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకొన్నారు. అనంతరం ఆల యం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ కమిటీ వారు సమకూర్చారు.

రేపటి నుంచి నరసింగపాడులో లక్ష బిల్వార్చన

నకరికల్లు నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నరసింగపాడులోని అ న్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 18వ తేదీ నుండి 53వ లక్ష బిల్వార్చన ఉత్సవాలను నిర్వహించనున్నారు. మంగళవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, కల్యాణం నిర్వహిస్తారు. బుధవారం స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేస్తారు. గురువారం స్వామి విశ్వరూప సందర్శనం, రాత్రికి తెప్పోత్సవం వైభవంగా నిర్వహిస్తారు.

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర

మాచర్ల రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూనగర్ మున్సిపల్ పార్కులో శ్రీరామకృష్ణా సేవాసమితి ఆధ్వర్యాన ఆదివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి నేతృత్వంలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లు తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ సీహెచ్ కోటేశ్వరరావు, వెంకటాచారి, హరిబాబు, సీహెచ్ శ్రీను, రుక్మిణి, సైదమ్మ, రాజేశ్వరి, మం గమ్మ, ప్రభావతి, వినయ్‌కుమార్, అజయ్‌కృష్ణ, మంగిరెడ్డి, రఘురామిరెడ్డి, నీళ్ల సుబ్బారెడ్డి, సాల్మన్ పాల్గొన్నారు.

నేటి నుంచి కుష్టు వ్యాధి బాధితుల గుర్తింపు

రెంటచింతల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కుష్టువ్యాధి నిర్మూలనలో భాగంగా సోమవారం నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమం చేపట్టనున్నట్లు రెంటచింతల, గోలి పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ ఎస్.కృష్ణారెడ్డి, ప్రదీప్ కుమార్‌రెడ్డి తెలిపారు. దీని కోసం ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చామని, 20 బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. శరీరంపై స్పర్శలు లేని మచ్చలుంటే వైద్య సిబ్బందికి తెలియచేయాలని కోరారు. ఈ నెల 30వ తేదీ వరకు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉంటుందన్నారు.

అన్నదానం ప్రారంభం

రెంటచింతల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని అయ్యప్ప కల్యాణమండపంలో అన్నదాన కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. డిసెంబరు 26 వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని నిర్వాహకులు చెప్పారు. తొలి రోజు ఎనిగండ్ల రామారావు, విజయలక్ష్మి దంపతులు 200 మందికి అన్నదానం చేసినట్లు తెలిపారు. అలాగే సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వార్ల ఆలయంలో 26వ రోజైన ఆదివారం 1600 మందికి అన్నదానం చేసినట్లు ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి, ట్రస్టుబోర్డు చైర్మన్ జీవీ శివయ్య చెప్పారు. అన్నదానం చేసిన ఏడుగురు దాతలను ప్రత్యేకంగా సన్మానించారు.

21న ఓపెన్ కబడ్డీ పోటీలు

కారంపూడి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కారంపూడిలో పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 21వ తేదీన కూటమి యూత్ ఆధ్వర్యాన ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. స్థానిక వీర్లగుడి ప్రాంగణంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఆసక్తి గల క్రీడాకారులు 8886993614, 9493139519 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

సత్రశాలలో చండీ హోమం

రెంటచింతల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశ్వామిత్రుడు తపస్సు చేసిన ప్రాంతంగా ఖ్యాతి గడించిన కృష్ణానది తీరాన గల సత్రశాల ఆదివారం వేదనాదంతో ప్రతిధ్వనించింది. వేదపండితులు సాగి నరశింహమూర్తి, కాశావఝుల శ్రీనివాసశర్మ, పిన్నెల్లి సుబ్రహ్మణ్యం నేతృత్వంలో 10 మంది రుత్విజులతో చండీహోమం, ఏకాదశరుద్రాభిషేకం, సహస్రదీపాలంకరణ భక్తిశ్రద్ధలతో జరిపారు. పలువురు దంపతులు హోమంలో పాల్గొన్నారు. నిర్వాహకులు దుగ్గరాజు గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ నారాయణభట్ల మధుబాబు దగ్గరుండి ఏర్పాట్లు చేశారు.

ఐదెకరాల అటవీ పట్టాలను రద్దు చేయాలి

అచ్చంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన సపావత్తు మారోణిబాయి, సపావత్తు రవీంద్ర బాయికి కేటాయించిన ఐదు ఎకరాల అటవీ పట్టాలను రద్దు చేయాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్‌కు ఫిర్యాదు చేశారు. అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘించి వారికి పట్టాలు మంజూరు చేశారన్నారు. బాణావత్తు బద్దు నాయక్, కన్నెకంటి తిరుపతిరావు, మునగాల పెద్ద సైదులు, ధరవాత్తు హరి ప్రసాదు నాయక్ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

శ్రీ కృష్ణ దేవాలయంలో కార్తిక వన భోజనాలు

మాచవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మాచవరంలోని శ్రీ కృష్ణ దేవాలయంలో ఆదివారం కార్తిక వన భోజనాల కార్యక్రమాన్ని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. ముందుగా మహిళలు దేవాలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, గీతాలాపనలు చేశారు. అనంతరం కార్తిక వన భోజనాలు నిర్వహించారు.

బెల్లంకొండలో వాహనాల తనిఖీ

బెల్లంకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, అందరికీ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని చెప్పారు. అనంతరం బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను ఆపి అపరాధ రుసుం వసూలు చేశారు.

సీఐఐ సదస్సుతో రాష్ట్రానికి పెట్టుబడుల వరద

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



వనసమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విశాఖ సీఐఐ సదస్సుతో రాష్ట్రంలో పలు పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమిప్రభుత్వం భరోసాతోనే రాష్ట్రంలో రూ.13.25 లక్షలకోట్ల పెట్టుబడులకు 613 ఎంఓయూలు జరిగాయన్నారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో 16 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయని, పరోక్షంగా వేలమందికి ఉపాధి దొరకనుందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రద్దయిన విమాన సర్వీసులను పునరుద్ధరణ.. ప్రయాణికులకు సౌకర్యవంతంగా, రాష్ట్రానికి ఆదాయం సమకూర్చడంలో ఉపయోగ పడుతుందన్నారు.

వనసమారాధనతో ఐక్యత

పిడుగురాళ్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్తిక మాసం ఎంతో పవిత్రతతో కూడినదని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఈ మాసంలో కార్తిక వనసమారాధన సంప్రదాయ కార్యక్రమం ఎన్నో ఏళ్ల నుంచి కొనసాగుతోందని ఆయన తెలియజేశారు. ఆదివారం జానపాడు కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో, శ్రీకృష్ణదేవరాయ కాపు సేవా సమితి కొండమోడు సీతారామస్వామి దేవాలయంలో, పిడుగురాళ్ల పట్టణ శ్రీకృష్ణదేవరాయ కాపు సేవాసమితి, ముచికుంద మహర్షి ఆశ్రమంలో పట్టణ ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో, దేవరంపాడు నేతి వెంకన్నస్వామి దేవాలయం వద్ద పిడుగురాళ్ల పట్టణ యాదవ సంఘం, కాకతీయ కమ్మసేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన కార్తిక వనసమారాధన కార్యక్రమాలలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి వనభోజనాల కార్యక్రమం ఆయా సామాజికవర్గాలలో ఐక్యత, అభివృద్ధికి దారులు వేస్తాయన్నారు. ఆయా దేవాలయాల్లో ఎమ్మెల్యే పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కొమ్మినేని రామచంద్రరావు, గుదె వెంకటేశ్వరరావు, జొన్నలగడ్డ శ్రీను, డాక్టర్ బండ్ల మణిదీప్, వడ్డవల్లి సాంబశివరావు, దియ్యా రామకృష్ణ, కెవి సుబ్బారావు, కనిగిరి శ్రీను, పాండురంగ శ్రీను, కట్టమూరి శంకరరావు, యేలూరి చంద్రశేఖరరావు, వనజా సాంబశివరావు, భవనాశి నరసింహారావు, కామిశెట్టి రమేష్, ఫైనాన్స్ సాంబశివరావు, కూరపాటి కొండలు, వున్నం వెంకట్రావు, ముప్పాళ్ల సాంబయ్య, కూరపాటి పకీరయ్య, వడ్లమూడి వెంకటేశ్వరరావు, వున్నం సురేష్ పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేను కలిసిన మైనారిటీ నేతలు

కూటమి ప్రభుత్వం మైనారిటీలకు అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో గురజాల నియోజకవర్గంలోని పలువురు ముస్లిం మైనారిటీ నేతలు ఎమ్మెల్యేను కలిశారు. 2014-19 టీడీపీ హయాంలో ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం ప్రవేశపెట్టామని యరపతినేని గుర్తుచేశారు. గత ప్రభుత్వం దాన్ని నిలిపేసిందని, కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇప్పుడు మరలా గౌరవవేతనాన్ని విడుదల చేశామన్నారు. ఈ సందర్భంగా మైనారిటీ నేతలతో కలిసి ఎమ్మె ల్యే యరపతినేని ప్రార్థన చేశారు. మైనారిటీ రాష్ట్ర నాయకులు షేక్ బాబావలి, సయ్యద్ అమీర్‌అలి, ఫరీద్‌మేస్త్రి, ఖాదర్‌వలి, సైదా, సుభాని, దూదేకుల ఖాశింసైదా పాల్గొన్నారు.

● స్వాములకు అన్నదానం

స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. అయ్యప్పమాలదారులకు 40 రోజుల పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించతలపెట్టిన దేవాలయ కమిటీని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఫౌండర్ గుండా శ్రీనివాసరావు, అధ్యక్షుడు అంచూరి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్మన్ కెవి సుబ్బారావు, పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మాచవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం మాచవరం మండలంలో పర్యటించనున్నట్టు జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కె.రజిని, మండల పార్టీ అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. కొత్తపాలెం, మాచవరంలో ప్రారంభోత్సవాలకు ఆయన హాజరుకానున్నట్టు తెలిపారు.

అమరేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు



అమరేశ్వరుని దర్శించుకుని వస్తున్న ఎమ్మెల్యే కన్నా

కృష్ణానదిలో స్నానాలు చేస్తున్న భక్తులు

అమరావతి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్తిక మాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకొని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలను వెలిగించారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల ఏర్పాట్లను దేవస్థాన సహాయ కమీషనర్ రేఖ, పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

ఇక పాలవాయిలో విద్యుత్ పున్నమి

● ఈఈ నూతలపాటి సింగయ్య



పాలువాయి సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఈ సింగయ్య

రెంటచింతల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్లెలకు అంతరాయంలేని విద్యుత్ సరఫరా చేసేందుకు కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని విద్యుత్ శాఖ ఈఈ నూతలపాటి సింగయ్య పేర్కొన్నారు. ఆదివారంపాలువాయిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.48 లక్షలతో గ్రామంలో చేపట్టిన ఆర్డీఎస్ఎస్(రీవ్యాప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ సిస్టం) పనులు పూర్తవ్వడం వల్ల రాత్రిళ్లు ప్రతి రోజు పున్నమిలా ఉంటుందన్నారు. ఇందులో భాగంగా 360 విద్యుత్ స్తంభాలు, 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 363 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 6 ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయ గృహ అవసరాలకు వేర్వేరు లైన్లు ఏర్పాటు చేశామన్నారు. త్రీఫేజ్ విద్యుత్ సరఫరాతో చిరు వ్యాపారులు, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. రెంటచింతలలో ఆర్డీఎస్ఎస్ పనులు జనవరి 20 నాటికల్లా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక చొరవతో మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, కారంపూడి మండలాల్లో సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు.ట్రూడౌన్ వల్ల విద్యుత్ చార్జీల భారం బాగా తగ్గిందని చెప్పారు. ఏఈ మస్తాన్ వలి, ఎన్‌సీసీ ప్రతినిధి సీపీ బాబయ్య పాల్గొన్నారు.

యువకులు వ్యసనాలకు బానిసలు కాకూడదు

● ఎన్ఆర్ఐ మైనేని అప్పారావు

పెదకూరపాడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కొందరు యువకులు వ్యసనాలకు బానిసలై తల్లిదండ్రులకు, సమాజానికి భారంగా మారటమే కాకుండా అసాంఘిక శక్తులుగా తయారవుతున్నారని ఎన్ఆర్ఐ మైనేని అప్పారావు అన్నారు. మండలంలోని లగడపాడు, కన్నెగండ్ల గ్రామాల్లో శ్రీ కాకతీయ జూనియర్ డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాకతీయ కళాశాల ప్రిన్సిపాల్ ఈ అశోక్‌బాబు, వ్యవసాయ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు వట్టికూటి శివ రామకృష్ణయ్య, మైనేని వెంకటేశ్వర్లు, షేక్ కరీం, వందనం, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ తల్లి దేవాలయంలో కార్తిక వన సమారాధన

పెదకూరపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులోని అంకమ్మతల్లి దేవాలయంలో ఆదివారం కార్తికవన సమారాధనను నిర్వహించారు. కార్తికమాసాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, మాజీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీలు గల్లా బాబూరావు, బెల్లంకొండ రామగోపాలరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, అంద్ర ప్రసాదు, మద్దినేని వెంకట సత్యనారాయణ, అర్తిమళ్ళ శేషయ్య, జీఆర్‌సీఆర్‌కే శ్రీ చైతన్య స్కూల్ విద్యా సంస్థల చైర్మన్ గుత్తా రాము, ఆలయ కమిటీ అధ్యక్షులు బెల్లంకొండ శ్రీధర్, ఆలయ పూజారి రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబాలెం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలి



క్రోసూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎర్రబాలెం గ్రామస్థులు

క్రోసూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): క్రోసూరు గ్రామ పంచాయతీకి శివారు గ్రామంగా ఉన్న ఎర్రబాలెంను ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఎర్రబాలెం ప్రత్యేక సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం క్రోసూరులో ర్యాలీ నిర్వహించారు. తమ గ్రామంలో 3వేల మంది జనాభా, 2వేల మంది ఓటర్లు ఉన్నప్పటికీ అభివృద్ధిలో పూర్తిగా నిరాదరణకు గురవుతోందని గ్రామస్థులు తెలిపారు. ఎర్రబాలెం గ్రామానికి వైస్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, గ్రామంలో అనేక సమస్యలతో కొట్టామిట్టాడుతున్నామని తెలియజేశారు. తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా గుర్తిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వచ్చే ఎన్నికల నాటికైనా ఎర్రబాలెం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని ఎమ్మెల్యే ప్రవీణ్‌కు వినతిపత్రం సమర్పించగా గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని అధికారులను ఆదేశించారని గ్రామస్థులు తెలిపారు. ర్యాలీలో సాధన సమితి అధ్యక్షుడు తోడిశెట్టి నీలేశ్వరరావు, తిమ్మిశెట్టి హనుమంతరావు, నీరుకొండ సరస్వతి, కోటేశ్వరరావు, కొండయ్య, విజయకుమారి, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి ఎక్కువ రుణాలివ్వాలి

● జిల్లా కాపునాడు అధ్యక్షుడు వెంకట సత్యనారాయణ



మాట్లాడుతున్న పోలిశెట్టి వెంకట సత్యనారాయణ

క్రోసూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాపు కార్పొరేషన్ ద్వారా మంజూరుచేసే రుణాల్లో పెదకూరపాడు నియోజకవర్గానికి ఎక్కువ రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కాపునాడు అధ్యక్షుడు పోలిశెట్టి వెంకటసత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం క్రోసూరులో నిర్వహించిన నియోజకవర్గ కాపునాడు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30న విజయవాడ జింఖాన గ్రౌండ్‌లో నిర్వహించతలపెట్టిన కాపునాడు స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఇటీవల పదవులు పొందిన క్రోసూరు మార్కెట్‌యార్డు డైరెక్టర్ మండడి నారాయణను, కోళ్ళూరు ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ చైర్మన్ ఆసుల జగన్‌ను, అమరావతి అమరేశ్వర దేవాలయ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ పోలిశెట్టి సత్యనారాయణను, పల్నాడు జిల్లా బీజేపీ కార్యదర్శి సులోచనను, టీడీపీ సీనియర్ నాయకుడు ఏపూరి లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గ కాపు నాడు అధ్యక్షుడు మానూరు రమేష్, నీలం రామారావు, వివిధ మండలాల కాపునాడు అధ్యక్షులు వెంగశెట్టి చిన్న, పులిబండ్ల సాంబశివరావు, లీగల్ సెల్ అధ్యక్షులు నరసింహారావు, జిల్లా కాపు నాయుడు కార్యదర్శి అప్పికట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు రైతుల జాబితా ప్రదర్శన

పెదకూరపాడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈ పంట నమో దు చేసుకున్న రైతుల జాబితాను ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతుల పరిశీలన నిమిత్తం ప్రదర్శించినట్లు మండల వ్యవసాయ అధికారి జి.కృష్ణయ్య ఆదివారం తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్ళి పంట పేరు, రకం పేరు, నాటిన తేదీ, నీటి వసతి, పంట సరళి తదితర వివరాలను సరి చూసుకొని పొరపాట్లు ఉంటే సరి చేయించుకోవాలని సూచించారు.

అమ్మవారి సన్నిధికి పోటెత్తిన భక్తులు

దుర్గి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్తిక మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా మండలంలోని అడిగొప్పుల శ్రీలక్ష్మీ అమ్మవారి సన్నిధికి పలు ప్రదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పల్లకి సేవచేస్తూ గుడిచుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ కమిషనర్ ఆదిశేషనాయుడు, ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

గణపతి దేవాలయంలో అన్నదానం

మాచర్ల రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సొమ్మిరెడ్డి బజారులో గల శ్రీకటారు మిట్ట గణపతి దేవాలయంలో ఆదివారం కార్తికమాస అన్నదానం చేశారు. వందలాదిగా ప్రజలు ఈ వన భోజనాల్లో పాల్గొన్నారు. గణపతిని దర్శించుకొని పూజలు జరిపారు. సామూహిక సత్యనారాయన వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో బిజ్జం సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడు వెంకటరమణయ్యకు నివాళి

నకరికల్లు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నకరికల్లులోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమ పితామహుడైన అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు గ్రంథాల ప్రాముఖ్యత గురించి వివరించారు.

● సత్తెనపల్లి: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం కొనసాగాయి. విద్యార్థులు పుస్తక పఠనంతో జ్ఞానాన్ని పొందవచ్చన్నారు. వివిధ రకాల పుస్తకాల ప్రదర్శనను నిర్వహించారు.

● పిడుగురాళ్ల: స్థానిక గ్రంథాలయంలో మూడో రోజు గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి స్మరించుకున్నారు. పుస్తకపఠనం ద్వారా ప్రతిఒక్కరికి జ్ఞానం పెంపుదలతో పాటు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని గ్రంథాలయ అధికారి రాజశేఖర్ తెలిపారు.

● అమరావతి: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వకృత్వపోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వెంకాయమ్మ పర్యవేక్షించారు. సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు వెంకాయమ్మ తెలిపారు.

● క్రోసూరు: క్రోసూరు గ్రంథాలయంలో బాలబాలికలకు చిత్రలేఖనం పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమ నాయకుల చిత్రపటాలకు పూలదండలు వేసి స్మరించుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.వీ రాంజమ్మ, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారు మైసూర్ బాబు పాల్గొన్నారు.

● దుర్గి: విద్యార్థుల మేధస్సుకు గ్రంథాలయాలు తోడ్పడతాయని గ్రంథాలయాధికారి పులిబండ్ల వేణుగోపి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు నీతికథలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు స్వర్గధామం ఏపీ

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పెట్టుబడులకు స్వర్గధామంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. విశాఖ వేదికగా జరిగిన సీఐఐ సమ్మిట్- 2025 విజయవంతంపై ఆదివారం ఆయన మాట్లాడారు. ఒక్క సదస్సుతో లక్షల కోట్ల పెట్టుబడుల ప్రవాహం ఏపీకి వరదలా వచ్చిందని చెప్పారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వచ్చేలా కంపెనీలను ఒప్పించడం ప్రశంసనీయమన్నారు. ఈ భాగస్వామ్య సదస్సుతో రాష్ట్రంలో దాదాపు రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు, 16 లక్షల ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవడం ఒక చరిత్ర అని కొనియాడారు. రాష్ట్రాభివృద్ధికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఊపందుకోవడానికి అహర్నిశలు పాటుపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి లోకేశ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

● జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

పట్టణంలోని ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచంచారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, ట్రైనింగ్ కార్పోరేషన్ ఆధ్వర్యాన ఈ జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 7842747682, 9492158153 నంబర్లను సంప్రదించాలన్నారు.

పెట్టుబడుల దిశను మార్చే వేదిక విశాఖ సమ్మిట్

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల దిశను మార్చే చారిత్రాత్మక వేదికగా విశాఖ సమ్మిట్ నిలిచిందని ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ప్రత్యేక పరిశ్రమలు, నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేసి ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం విడిచి వెళ్ళిన కంపెనీలు తిరిగి రావటం చాలా పెద్ద పరిణామమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ విజన్‌తో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా దూసుకు వెళ్తుందని, విశాఖ సమ్మిట్ ఈ మార్పునకు పునాది అని ఎమ్మెల్యే ప్రవీణ్ అన్నారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తులు ఆహ్వానం

సత్తెనపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని భవన నిర్మాణాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మునిసిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్ ఆదివారం తెలిపారు. పురపాలక సంఘ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మించుకున్న గృహాలు, భవనాలు, అపార్ట్‌మెంట్లను క్రమబద్ధీకరించేందుకు బిల్డింగ్ పీనలైజేషన్ ప్రభుత్వం తెచ్చిందని ఆయన చెప్పారు. పట్టణ పరిధిలో 1985 జనవరి 1 నుంచి ఈ ఏడాది ఆగస్టు 31 మధ్య చేపట్టిన అనధికార నిర్మాణాలు, అనుమతులు తీసుకున్నప్పటికీ వాటిని అతిక్రమించి జరిపిన నిర్మాణదారులు బీపీఎస్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లింకు డాక్యుమెంట్లు, ప్రస్తుతం మార్కెట్ విలువ పత్రం, స్ట్రక్చరల్ స్టెబులిటీ సర్టిఫికెట్, ఇంటి చిత్రాలు తదితరాలతో రూ.పది రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. చట్ట బద్ధంగా సక్రమంగా ఉంటేనే అనుమతులు ఇచ్చి క్రమబద్ధీకరిస్తామని చెప్పారు. ప్రభుత్వ భూములు, చెరువులు, మాస్టర్ ప్లాన్ రహదారి, రహదారి ప్లాన్‌లైన్, వివాదంలో ఉన్న భూములకు ఈ పథకం వర్తించదని ఆయన తెలిపారు.

పిచ్చి కుక్క దాడిలో చిన్నారికి తీవ్రగాయాలు

అచ్చంపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో చిన్నారి తీవ్రంగా గాయపడిన ఘటన అచ్చంపేట మండలం చింతపల్లిలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన చిన్నారి అఖిలేశ్వర్ ఇంటి ముందు ఆడుకుంటుండగా అతడిపై పిచ్చి కుక్క దాడి చేసి కరవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. గాయాలపాలైన అఖిలేశ్వర్‌ను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు, ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోనూ పిచ్చి కుక్క కరిచి ముగ్గురికి గాయాలయ్యాయి.

వాహనాలను రాంగ్‌రూట్‌లో నడపొద్దు

● ఎస్ఐ సతీష్



నకరికల్లులో రోడ్డుకు ఎదురుగా వస్తున్న వాహన చోదకులను ఆపి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ కె.సతీష్

నకరికల్లు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా రాంగ్‌రూట్‌లో నడిపి ప్రమాదాలకు కారకులు కావొద్దని వాహనదారులకు ఎస్ఐ కె.సతీష్ సూచించారు. ఆదివారం నకరికల్లు అడ్డరోడ్డు నుంచి చల్లగుండ్ల అడ్డరోడ్డు, నకరికల్లు ప్రధాన కూడళ్లల్లో, రోడ్డు మార్జిన్‌లలో ఎదురెదురుగా వాహనాలను నడుపుతున్న వాహనదారులను నిలిపి కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే రోడ్డు మార్జిన్‌లలో వాహనాలు నిలిపిన వాహన యజమానులను భారీగా అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు.

జిల్లా కుస్తీ జట్టు ఎంపిక



జిల్లాస్థాయి కుస్తీ పోటీల్లో ఎంపికైన టీమ్‌తో కార్యదర్శి గుడిపూడి భూషణం

అచ్చంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అచ్చంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సీనియర్, పురుషులు, స్త్రీల ఎంపికలు జరిగాయి. ఎంపికైన వారు డిసెంబరు 2, 3వ తేదీల్లో చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా కార్యదర్శి గుడిపూడి భూషణం తెలిపారు.

అచ్చంపేట టీడీపీ అధ్యక్షుడిగా సందెపోగు గాంధీ



అచ్చంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అచ్చంపేట టీడీపీ టౌన్ అధ్యక్షుడిగా సందెపోగు గాంధీ ఎంపికయ్యారు. ఎస్సీ కాలనీకి చెందిన గాంధీ పదేళ్లుగా టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్‌కు గాంధీ కృతజ్ఞతలు తెలిపారు.

జనసేన పట్టణ అధ్యక్షుడిగా రవికుమార్



జనసేన పట్టణ అధ్యక్షుడిగా జిల్లా అధ్యక్షుడి నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న రవికుమార్

దాచేపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ పట్టణ అధ్యక్షుడిగా వెచ్చాల రవి కుమార్‌ను నియమిస్తూ జనసేన జిల్లా పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు నియామకపత్రాలను అందజేశారు. ఆదివారం దాచేపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు హాజరైన నూతన పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన రవికుమార్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ పార్టీని వార్డు స్థాయి నుంచి బలోపేతం చేస్తామని వివరించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.62 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువనుంచి వెయ్యి క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. పవర్ జనరేషన్ ద్వారా 7,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం 8వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఏఐఐఎంఎస్ పీజీ ఎంట్రన్స్‌లో శంకర్‌కు 60వ ర్యాంకు


ఈదర శంకర్

నరసరావుపేట టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఐఎంఎస్) పీజీ ఎంట్రన్స్‌లో నరసరావుపేటకు చెందిన ఈదర శంకర్ ఆల్ ఇండియా స్థాయిలో 60వ ర్యాంకు సాధించాడు. శంకర్ బెంగుళూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేశాడు. ఈ నెల 9వ తేదీన జరిగిన ఏఐఐఎంఎస్ ఎంట్రన్స్ పరీక్షలో ఈ ఘనత సాధించాడు. శంకర్ తల్లి సుధారాణి నరసరావుపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్నారు. శంకర్ ఆల్ ఇండియా స్థాయిలో 60వ సాధించటంపై స్నేహితులు, బంధువులు అభినందించారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

వినుకొండ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆధార్ ప్రత్యేక క్యాంపులు సోమవారం నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ వార్డు సచివాలయం పరిధిలోని కృష్ణవేణి జూనియర్ కళాశాల, 8వ వార్డు సచివాలయం పరిధిలోని గీతాంజలి స్కూల్‌లో ఉదయం 10నుంచి సాయత్రం 5గంటల వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తారన్నారు. ఆధార్ క్యాంపులను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

నర్సరావుపేట లీగల్, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో రవిశంకర్ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు రెండో పట్టణ ఎస్ఐ ప్రియాంక తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు ఉత్తర్వులు మేరకు ఎస్ఐ లేఖ ప్రియాంక ఆదివారం అర్ధరాత్రి రవిశంకర్ రెస్టారెంట్ వద్ద మద్యం విక్రయిస్తున్న బరంపేటకు చెందిన తాడిశెట్టి సాగర్, బాపట్ల జిల్లా కొరిసపాడు మండలం రావినూతల గ్రామానికి రమేష్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి వివిధ కంపెనీలకు చెందిన 94మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. రాత్రి సమయాల్లో అక్రమంగా మద్యం విక్రయించే వారిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఏపీ పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

నరసరావుపేట టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ పల్నాడు జిల్లా యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నరసరావుపేటలోని పీఆర్ఐ డివిజన్ కార్యాలయం ప్రాంగణంలో జరిగాయి. అధ్యక్షుడిగా వైవీ రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడిగా ఎల్.శ్రీనివాస్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా జీ శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా ఎం.వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.వసుంధర ఎన్నికయ్యారు. వీరు ఆఫీస్ బేరర్లుగా 2026-2028 కాలానికి ఎన్నికల తేదీ నుంచి మూడు సంవత్సరాల పాటు కార్యాలయంలో ఉంటారు. ఎన్నికలను పల్నాడు జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రస్తుత జనరల్ సెక్రటరీ కేపీవీఎస్ శేషప్పయ్య నిర్వహించారు.

యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి విరాళం

నరసరావుపేట టౌన్. నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయం రాతి కట్టడానికి వేములు వెంకట నాగసాయి ప్రణీత్ ఆదివారం రూ.1,00,116లు విరాళం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వనమా కృష్ణ, కోవూరు శివ శ్రీనుబాబు, బత్తుల విష్ణు, రాచూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ రాయితీపై అవగాహన సదస్సు

నూజెండ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న గ్యాస్ రాయితీపై వినియోగ దారులకు ఆదివారం స్థానిక భారత్ గ్యాస్ కార్యాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల గణేష్ భారత్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ గణేష్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి మూడు సిలిండర్లకు పూర్తి పైకం అకౌంట్‌లో జమ అవుతుందన్నారు. వినియోగదారులందరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని, రాయితీ పైకం తమ వ్యక్తిగత ఖాతాల్లో జమ కాకుంటే గ్యాస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వినియోగదారుల సమస్యలు పరిష్కరించటానికి తమ సంస్థ ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని తెలిపారు.

స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ఎన్ విద్యార్థి ఎంపిక

నరసరావుపేట టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి ఎస్.జగదీశ్ అఖిలభారత అంతర విశ్వవిద్యాలయాల స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ ఆదివారం తెలిపారు. ఈ నెల 14న గుంటూరులోని ఎన్‌టీఆర్ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన ఏఎన్‌యూ స్విమ్మింగ్ సెలక్షన్స్‌లో 100 మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్, 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో ఏఎన్‌యూ జట్టుకు ఎంపికయ్యాడన్నారు. డిసెంబరు 18నుంచి 23 వరకు ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో జరిగే అఖిల భాతర అంతర విశ్వవిద్యాలయాల స్విమ్మింగ్ పోటీలలో ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. ఈ సందర్భంగా ఎస్.జగదీశ్‌ను పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపాల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్త, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాససాయి, పీడీ డాక్టర్ యక్కల మధుసూధనరావు, అభినందించారు.

శిథిలావస్థలో కారుమంచి బ్రిడ్జి


కారుమంచి వద్ద ఏబీసీ కెనాల్‌పై శిథిలావస్థలో ఉన్న వంతెన

- ప్రమాదకరంగా ఉన్నా వీడని నిర్లక్ష్యం
- రెయిలింగ్‌లు లేక వరుస ప్రమాదాలు
- బ్రిడ్జి నిర్మాణంపై ప్రభుత్వాల నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కారుమంచి (శావల్యాపురం) నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వంతెనలు నిర్మించి ఏళ్ళు గడవడంతో అవి శిథిలావస్థకు చేరి ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ప్రభుత్వాలు మారినా ఎవ్వరూ వంతెన నిర్మాణాల వైపు మొగ్గుచూపకపోవడంతో పాటు కనీస మరమ్మతులు కూడా చేయించకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తుండడడంతో ప్రమాదాల బారినపడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. శావల్యాపురం మండలం కారుమంచి సమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్‌పై నిర్మించిన వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. 2017లో టీడీపీ ప్రభుత్వ హయాంలో కారుమంచి టీడీపీ నాయకులు అప్పటి భారీ నీటిపారుదలశాఖమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుని సచివాలయంలో కలసి బ్రిడ్జి గురించి వివరించి పునర్నించాలని లిఖితపూర్వకంగా వినతిపత్రం సమర్పించారు. దాంతో ఎన్నెస్పీ అధికారులు వంతెన క్షేత్రస్థాయిలో పరిశీలించి పునర్ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేశారు. కానీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో వదిలేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం వైపు కన్నెత్తయినా చూడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరోసారి టీడీపీ నాయకులు బ్రిడ్జి నిర్మాణం గురించి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు విన్నవించగా అధికారులతో అంచనాలు వేయించారు. అంచనాలు వేసి ఏడాది గడుస్తున్నా ఎటువంటి పురోగతి లేదు. ఇటీవల కారుమంచి పెద్దలు మరోసారి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును కలసి వంతెనను నిర్మించాలని కోరారు. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు వద్ద అద్దంకి- నార్కెట్‌పల్లి జాతీయ రహదారి ఎక్కేందుకు కారుమంచి మీదుగా నిత్యం వివిధ గ్రామాల నుంచి వందలకొద్దీ వాహనాలు ఇదే బ్రిడ్జి పైనుంచి ప్రయాణిస్తుంటాయి. పంటల కొనుగోలు సమయంలో అధిక లోడ్‌తో వంతెన పైనుంచి వెళుతుంటాయి. బ్రిడ్జిపై రెయిలింగ్ కూడా లేకపోవడంతో రాత్రి వేళల్లో వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవల పలువురు ప్రమాదాల బారినపడి మృత్యువాత పడ్డారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించకపోవడంతో గ్రామస్థులు మిన్నకుండిపోయారు. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణం చేపట్టి ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు


అష్టావధాని నారాయణం బాల సుబ్రహ్మణ్యం, పృచ్ఛకులతో గ్రంథాలయ అధికారి యడ్లపాటి రాధ, తదితరులు

నరసరావుపేట టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం మూడో రోజు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో నిర్వహించిన నారాయణ బాలసుబ్రహ్మణ్యం 380వ అష్టావధానం అలరించింది. చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి, ఎం.భానుప్రసాదరావు, కే.నాగరాజశర్మ, ఎస్.వెంకట రాంబాబు, రత్నాకరం రాము, ఎం.శివరామయ్య, ఆర్.సురేష్ పృచ్ఛకులుగా పాల్గొని అష్టావధానం శ్రోతలను రంజింపజేశారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వారోత్సవాల సందర్భంగా ముందుగా పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య, డాక్టర్ ఏఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమానికి కృష్ణవేణి డిగ్రీ కళాశాల గ్రంథాలయ అధికారి కేఎంఎల్ ప్రసాదరావు, కోఆర్డినేటర్ కే కుమారి, విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయం అధికారి యడ్లపాటి రాధ, విద్యార్థులు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

- రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు గ్రామాల్లోని శాఖా గ్రంథాలయాల్లో 58వ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతున్నాయి. కాగా ఆదివారం గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులర్పించారు. అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి గ్రంథాలయ అధికారి కేసరి రమణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- బొల్లాపల్లి: గ్రంథాలయాల ఉద్యమానికి కృషిచేసిన పలువురు ప్రముఖుల చిత్రపటాలకు గ్రంథాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి రామావత్ సేవా నాయక్ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులు ఎస్ఆర్ రంగనాథన్, వెంకటరమణయ్యల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏరుగాని రామకృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.
- నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి గ్రంథాలయ అధికారి జీ సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- శావల్యాపురం: సెంటర్లోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రావూరి శ్రీనివాసరావు, శ్రీరామపబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్ చంద్ పాల్గొని గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. వారు మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణయ్య, వావిలాల గోపాల కృష్ణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, కాశీనాధుని నాగేశ్వరరావులు ఎంతో కృష్టపడి ఊరూరా గ్రంథాలయాలను ఏర్పాటుచేసి వాటి అభివృద్ధికి కృషి చేశారన్నారు. గ్రామ పెద్దలు సనిశెట్టి లక్ష్మీనారాయణ, మద్దికుంట వీరాంజనేయులు, కోటా శ్రీనివాససింగ్, శ్రీరాములు ఉన్నారు.
- ఈపూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు మత్తు వ్యసనాలపై డిబేట్ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ధనలక్ష్మి కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు పాల్గొన్నారు. ఈపూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈపూరు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మీసాల శివప్రసాద్, బొల్లా సుబ్బారావు, గ్రంథాలయ అధికారులు నాగలక్ష్మి, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మీయ, అనుబంధాలకు ప్రతిరూపం

కార్తిక వన సమారాధనలు

- చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు


కాకతీయ వన సమారాధనలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): కార్తిక వన సమారాధనలు ఆత్మీయ, అనుబంధాలకు ప్రతిరూపమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ సమీపంలోని కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో కాకతీయ వనసమారాధన, శాలివాహన సంఘం ఆధ్వర్యంలో, బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్తిక వనసమారాధనల్లో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా సామాజిక బంధాలు మరింతగా బలపడతాయన్నారు. కార్యక్రమాల్లో పాల్గొన్న శ్రీశైలం బోర్డ్‌మెంబర్ బోడెపూడి వెంకటసుబ్బారావును జీవీ, మక్కెన, పలువురు ప్రముఖులు కలసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో గడిపూడి వెంకట్రాయుడు, లగడపాటి వెంకట్రావు, గంగినేని రామయ్య, గడిపూడి విశ్వనాధం, యార్లగడ్డ లెనిన్, ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు, బంకూరి రోశయ్య, పెమ్మసాని నాగేశ్వరరావు, పీవీ సురేష్, రమణారావు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

- బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు కురువ కింద ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఆర్యవైశ్య కార్తిక వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య నాయకులు, ప్రముఖులు పాల్గొని ముందుగా మహిళలు దేవాలయం వద్ద కార్తిక పూజలు నిర్వహించారు. అక్కడకు వచ్చిన మహిళలకు, చిన్నారులకు మండవ వెంకట సత్యనారాయణ కుర్చీలాట, క్విజ్ తదితర ఆటలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కార్తిక మాసంలో పవిత్రమైన ఉసిరిక చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ ఎత్తున అన్నదానం చేశారు. కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య నాయకులు, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.
- యడ్లపాడు: పవిత్రమైన కార్తికమాసం సందర్భంగా మండలంలోని మామిడి తోటల్లో సంప్రదాయ పద్ధతిలో వనభోజనాల కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. కుటుంబ సభ్యులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో వన సమారాధనకు తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. మండలంలోని సంగంగోపాలపురం పరిధిలోని ఆషాపురి గార్డెన్స్‌లో పావులూరి రత్తన్నగారి ముఠా (వారసుల కుటుంబాలు) ఆధ్వర్యంలో పంచమ కార్తికవనసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తిమ్మాపురం, అవిశాయిపాలెం, వేలూరు, రాజుపాలెం, యడ్లపాడు గ్రామాలతోపాటు చిలకలూరిపేట, గుంటూరు, హైదరాబాదు నగరాల్లోని రత్తన్న కుటుంబ వారసులు పెద్దఎత్తున తరలివచ్చారు. ముందుగా కుటుంబ సభ్యులందరూ చెంఘీజ్‌ఖాన్‌పేటలోని వెన్నముద్దల బాలకృష్ణుని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం తోటవద్దకు చేరి ఉసిరి చెట్టుకు సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించి పొంగలి నైవేద్యం సమర్పించి కార్తిక దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా సామెతల పోటీలు నిర్వహించడంతోపాటు పెద్దలను ఘనంగా సత్కరించారు. అనంతరం అందరూ కలసి విందు భోజనాలను ఆరగించారు. కార్యక్రమాలను రత్తన్న కుటుంబ సభ్యులు పర్యవేక్షించారు. వీరితోపాటు పోస్టల్ డిపార్ట్‌మెంట్, ఉన్నవ గ్రామస్థులు, ఓల్డ్ స్టూడెంట్స్ యూనియన్‌ల ఆధ్వర్యంలోనూ కార్తిక వనభోజనాలు జరిగాయి.
- నరసరావుపేట లీగల్: నరసరావుపేట న్యాయవాదుల వన సమారాధనను మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని కుల మతాలకు అతీతంగా న్యాయవాదులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకంగా ఉందన్నారు. వన సమారాధనలో న్యాయవాద సంఘ అధ్యక్షుడు జీవీ సుబ్బారావు, ఉపాధ్యక్షుడు ఎన్‌వీ నాగరాజు, కార్యదర్శి ఎస్.ప్రసాద్, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.
- నాదెండ్ల: మండలంలోని గణపవరం, సాతులూరు గ్రామాల్లోని ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. గణపవరంలోని కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలలో పలువురు దంపతులు కార్తిక వ్రతం నిర్వహించారు. ఉసిరిచెట్టు, గోమాతకు పూజలు చేశారు. అలానే సాతులూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొండవీటి కోటలో జరిగిన కార్తిక వన సమారాధనలో సంఘస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
- ఈపూరు: తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోని బొటానికల్ గార్డెన్స్‌లో ఆదివారం పల్నాడు జిల్లా ఈపూరు మండలం ముప్పాళ్ళ వన భోజన మహోత్సవం జరిగిందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు తెలిపారు. గ్రామానికి చెందిన 460 మంది వన భోజనాలకు హాజరయ్యారని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత రామజోగయ్యశాస్త్రి, కె.హనుమయ్య, వి.వరదయ్య, మాజీ సర్పంచ్ ఎం.నరసింహారావు, ఎం.సత్యానారాయణ, పి.వెంకటరావు, వి.అచ్చెయ్య, మద్దినేని పూర్ణచంద్రరావు, పాలడుగు సాంబశివరావు, కావూరి శ్రీరాములు, రాపర్ల జగ్గారావు, గుర్రం ఆంజనేయులు, వంగవోలు అప్పారావు, వీరవల్లి శ్రీనివాసరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఎంజే మాణిక్యారావు శత జయంతి

నరసరావుపేట టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఆదివారం కళాశాల యాజమాన్యం, ఏసీటీఏ ఏపీ ఆధ్వర్యంలో ఎంజే మాణిక్యారావు శత జయంతి ఉత్సవాలలో భాగంగా 17వ సంస్మరణ సభ నిర్వహించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంజే మాణిక్యారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఎంజే మాణిక్యారావు అనేక ఉద్యమాలు చేపట్టి, అధ్యాపకులకు కావలసిన సౌకర్యాలను సాధించారన్నారు. ఎయిడెడ్ కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలకు జీతాలు, పింఛన్లు, పీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్లు, యూజీసీ వచ్చేలా కృషి చేశారన్నారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ మాట్లాడుతూ ఎంజే మాణిక్యరావు ఎయిడెడ్ సంస్థల పరిపుష్టికి రాష్ట్ర, కేంద్ర సంస్థల నుంచి యూజీసీ గ్రాంట్లు తెప్పించడంలో కృషి చేశారన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా మాట్లాడుతూ ఎంజే మాణిక్యరావు కావలి జవహర్ భారతీలో గణిత శాస్త్ర అధ్యాపకుడి పనిచేశారని, రాష్ట్రంలో దాతలను ప్రోత్సహించి ప్రతి పేద విద్యార్థికి ఉన్నత విద్య అందించేలా కృషిచేశారన్నారు. కార్యక్రమంలో ఏసీటీఏ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కే మోహనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాససాయి, జనరల్ సెక్రటరీ ఎం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఐ సదాశివరెడ్డి, డాక్టర్ ఎం.రమేష్, వీ ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల ప్రవాహం మొదలైంది: కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్. నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 17 నెలలో పెట్టుబడుల ప్రవాహం మొదలైందని, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకు రావడానికి సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ఎంతో కృషి చేస్తున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఆదివారం పేర్కొన్నారు. విశాఖను గ్లోబల్ డిజిటల్ హబ్‌గా తీర్చిద్దిడంలో సీఐఐ సదస్సు కీలక పాత్ర పోషించనుందన్నారు. 2019-24 మధ్య రాష్ట్రంలో ఉన్న పెద్ద కంపెనీలను వైసీపీ పారిపోయేలా చేసిందని ఆరోపించారు.

బాలుర వసతి గృహంలో దంత వైద్య శిబిరం


దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బండ్ల రామ్‌చంద్ తదితరులు

నరసరావుపేట టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నరసరావుపేట కాకతీయ విద్యా ట్రస్ట్ బాలుర వసతి గృహంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వందమంది విద్యార్థులకు డాక్టర్ బండ్ల రామ్‌చంద్ బృందం దంత పరీక్షలు నిర్వహించి, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ మేదరమెట్ల శేషగిరిరావు, మాకినేని హరిబాబు, కోయా రామారావు, కే బాబురావు, పీ శ్రీనివాసరెడ్డి, కే నాగజ్యోతి, జీ ప్రశాంత్, ఎస్.నాగరాజు, పీ శ్రీనివాసరావు, హనుమంతరావు, ఎస్.రాజేంద్ర, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



చిలకలూరిపేట సీఆర్ కాలనీ పార్క్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ప్రత్తిపాటి

ఐఏఎస్ కృష్ణతేజ సహకారంతో

సమగ్రంగా సీఆర్ కాలనీ పార్క్ అభివృద్ధి

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటకు చెందిన ఐఏఎస్ అధికారి కృష్ణతేజ సహకారంతో పట్టణంలోని సీఆర్ కాలనీ పార్క్‌ను సమగ్రంగా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం అన్నారు. పార్క్‌లో వాకర్స్ క్లబ్ అసోసియేషన్ నిర్వాహకులు, సభ్యులు నిర్వహించిన కార్తిక వనభోజనాల కార్యక్రమంలో ప్రత్తిపాటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పార్కు పేరుతో నెలకొల్పిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. స్థానిక ఆర్.వీ.ఎస్. పాఠశాల మరమ్మతులు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి కృష్ణతేజ సహకారంతో రూ.40లక్షలు నిధులు లభించాయన్నారు. పార్కులు, చెరువులు, శ్మశానాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలగా ఉన్నదని చెప్పారు. నియోజకవర్గానికి చెందిన ప్రముఖులు, ఉన్నతస్థానాల్లో ఉన్నవారు మన ప్రాంత అభివృద్ధికి సహాయ సహకారాలు అందించడంలో ఎప్పుడూ ముందుంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు పఠాన్ జాఫర్‌ఖాన్, గుడిపల్లి సాంబశివరావు, అరెకట్ల కోటి సుబ్బారావు, చిరుమెళ్ళ శ్రీనివాసరావు, రామ సుబ్బారావు, గ్రంధి భాస్కరరావు, మోహన్‌రావు, మారెళ్ళ అప్పారావు, గట్టినేని రమేష్, పిల్లి కోటేశ్వరరావు తదితరులున్నారు.

అన్న క్యాంటీన్‌లకు రూ.లక్ష విరాళం


రూ. లక్ష విరాళపు చెక్కును ప్రత్తిపాటికి అందచేస్తున్న చెంచుపున్నయ్య తదితరులు

చిలకలూరిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం మాజీ అధ్యక్షుడు బొగ్గవరపు చెంచుపున్నయ్య తన దివంగత సతీమణి రామతులసమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం రూ. లక్ష విరాళాన్ని ఆదివారం అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యులు, యోగా మిత్ర బృందంతో కలిసి చెంచుపున్నయ్య ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి విరాళపు చెక్కును అందచేశారు.

ఘనంగా నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ళ


జలబిందెలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

శావల్యాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో తిరునాళ్ళను ఆలయ ధర్మకర్త మద్దినేని హరిబాబు, ఆలయ ప్రముఖులు కేతేపల్లి వెంకటేష్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే మహిళలు జలబిందెలతో దేవాలయానికి ఊరేగింపుగా వచ్చి రాళ్ళగుట్టకు క్షీరాభిషేకాలు చేశారు. అనంతరం శ్రీలక్ష్మీ అమ్మవారికి, నాగేంద్రస్వామికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో పొంగలి వండి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. సాయంత్రం గ్రామపురవీధుల్లో మేళతాళాలతో, భక్తులు ప్రత్యేక వేషధారణలతో వైభవంగా జెండాను ఊరేగించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రికి దేవాలయం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

గోపువారిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ


గోపువారిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

ఈపూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపువారిపాలెంలో ఆదివారం చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నర్రా కిషోర్, అంగలూరు సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి బాలయ్య, సొసైటీ డైరెక్టర్ అయినాల కోటేశ్వరరావు, సర్పంచ్ గోనుగుంట్ల శ్రీనివాసరావు, అబ్బూరి ఏడుకొండలు, గోపు వీరాంజనేయులు, కోంద్రు కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, సూరే కోటేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఊడిజర్ల కాలనీలో వైద్య శిబిరం


ఊడిచర్ల ఎస్సీ కాలనీలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఈపూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాచి చల్లార్చిన నీళ్ల తాగడం వలన వ్యాధులు దరిచేరవని కొచ్చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీఎన్‌హెచ్ ఎన్ టి.లక్ష్మీనరసమ్మ అన్నారు. మండలంలోని ఊడిజర్ల గ్రామం ఎస్సీ కాలనీలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఇద్దరకు డెంగీ జ్వరం నిర్ధారణ కావడంతో మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. జలుబు, జ్వరం వ్యాధులు సోకడానికి కారణం తాగునీరు పరిశుభ్రంగా లేకపోవడం అన్నారు. ప్రతిఒక్కరూ తాగునీటిని కాచిచల్లార్చి తాగాలన్నారు. శిబిరంలో ఏఎన్ఎం విజయలక్ష్మి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీల చించివేతతో ఉద్రిక్తత

బొల్లాపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగులపాలెంలో శ్రీనీలంపాటి అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా టీడీపీ నేతలు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను వైసీపీ శ్రేణులు చించివేయటంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా టీడీపీ నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జిల్లా డీసీసీ డైరెక్టర్ మక్కెన మల్లికార్జునరావు శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. ఐతే కొంతమంది వైసీపీ శ్రేణులు మద్యం మత్తులో టీడీపీ బ్యానర్లు చించివేసి బీభత్సం సృష్టించారు.